


# విజయభాను




విశాఖపట్నం, ఆదివారం 30-09-2018 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 42 సంచిక : 18 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## సర్జికల్ దాడులు కొనసాగుతాయి

### నిర్మలా సీతారామన్



చెన్నై : పొరుగుదేశం గుణపాఠం నేర్చుకుంటుందా లేదా అనే విషయంతో సంబంధం లేకుండా పాకిస్థాన్‌తో అంతర్జాతీయ సరిహద్దుల్లో తమ చర్యలు కొనసాగుతూనే ఉంటుందని కేంద్ర రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు.

2016 సర్జికల్ దాడులను ప్రస్తావిస్తూ మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదుల శిక్షణ, ఉసిగొల్పడం వంటి పాక్ చర్యలను ఈ తరహా దాడుల వల్లే నిరోధించే అవకాశాలుంటాయని తాను నమ్ముతున్నట్టు చెప్పారు.

చెన్నైలో మీడియాతో మంత్రి మాట్లాడుతూ, రాఫెల్ ఒప్పందం విషయంలో తాను పార్లమెంటులో చాలా స్పష్టమైన వివరణ ఇచ్చానని అన్నారు. ప్రతిపక్షాల ఆరోపణలపై నాలుగు సార్లు స్పందించానని, లిఖిత పూర్వక సమాధానం కూడా ఇచ్చానని సీతారామన్ చెప్పారు. తాను చెప్పిన సమాధానాలతో విపక్షాలు సంతృప్తి చెందాయా అన్నదే తన ప్రశ్న అని అన్నారు. రష్యా నుంచి ఎస్-400 ట్రయంప్ ఎయిర్ డిఫెన్స్ సిస్టం కొనుగోలుకు చాలా కాలంగా చర్యలు జరుగుతున్నాయని, ప్రస్తుతం ఈ ఒప్పందం తుది దశలో ఉందన్నారు. ఈ ఏడాది చివరి నాటికి ఒప్పందంపై సంతకాలు జరిగే అవకాశాలున్నాయని మంత్రి చెప్పారు. రష్యాతో ఎస్-400 మిసైల్ డీల్ విషయంలో అమెరికా నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నా తాము ముందుకే వెళ్తామని నిర్మలా సీతారామన్ గత జూలైలోనూ పేర్కొన్నారు.

## ఏపీకి తీవ్రమైన అన్యాయం చేశారు



- రాజధానికి రూ. 1500 కోట్లే ఇచ్చి ద్రోహం చేశారు
- ప్రపంచ అత్యుత్తమ నగరాల్లో అమరావతి నిలుస్తుంది
- మోదీ ప్రభుత్వం అవినీతిపరులను కాపాడుతోంది
- అంతిమంగా గెలిచేది ధర్మం, న్యాయమే
- పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం

### తాడేపల్లిగూడెం ధర్మపోరాట సభలో చంద్రబాబు

తాడేపల్లిగూడెం:: ఏపీకి కేంద్రం తీవ్రమైన అన్యాయం చేసిందని, విభజన చట్టంలో హామీలన్నీ తప్పకుండా నెరవేరుస్తామని చెప్పి.. నాలుగేళ్లయినా కేంద్రం ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు విమర్శించారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఏర్పాటు చేసిన ధర్మపోరాట సభలో చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. మన రాజధానికి రూ. 1500 కోట్లే ఇచ్చి ద్రోహం చేశారు. రూ. 1500 కోట్లతో ఎలక్ట్రిసిటీ కేబుల్ కూడా రాదు. వెనుకబడిన జిల్లాలకు నిధులు ఇచ్చి వెనక్కి తీసుకున్నారు. అకౌంట్‌లో వేసిన డబ్బులు వెనక్కి తీసుకోవడం చట్ట వ్యతిరేకం. విద్యాసంస్థలకు అరకొర నిధులు ఇచ్చారు. దుగరాజపట్నం పోర్టు విషయంలోనూ కేంద్రం మోసం చేసింది. రామాయపట్నం పోర్టు నిర్మించుకుంటామంటే అడ్డుకుంటున్నారు. విశాఖ-చెన్నై కారిడార్‌కు నిధులు ఇవ్వడం లేదు అని చంద్రబాబు దుయ్యబట్టారు. నాలుగేళ్లుగా ప్రత్యేక హోదా ఉండి ఉంటే.. 90శాతం గ్రాంటు వచ్చేది. 11 రాష్ట్రాలకు ప్రత్యేక హోదా ఇచ్చారు. ఏపీకి ఎందుకివ్వరని అడిగాం. విశాఖ రైల్వేజోన్, కడప ఉక్కు కర్మాగారం రాకుండా అడ్డుపడుతున్నారు. విజయవాడ, విశాఖ మెట్రో రైళ్లకు ప్రాధాన్యం ఇవ్వట్లేదు. ఇతర నగరాల్లో ర్యాపిడ్, బుల్లెట్ రైళ్ల

తరువాయి 2లో..

## హరీశ్‌రావుకు తప్పిన ప్రమాదం



సంగారెడ్డి : తెరాస ప్రచార కార్యక్రమంలో అపశ్రుతి చోటుచేసుకుంది. మంత్రి హరీశ్‌రావుకి తృటిలో ప్రమాదం తప్పింది. సంగారెడ్డిలో తెరాస కార్యకర్తలతో కలిసి హరీశ్‌రావు ద్విచక్రవాహన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓ కూడలి వద్ద కార్యకర్తలు పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. అయితే ద్విచక్రవాహనాలకు అతిసమీపంలో బాణసంచా కాల్చడంతో పలు టపాసులు పేలి కార్యకర్తలపై పడ్డాయి. దీంతో కార్యకర్తలు భయంతో ద్విచక్రవాహనాలు వదిలి ఒక్కసారిగా పరుగులు

తరువాయి 2లో..

## సునామీ బీభత్సం

### 384కి చేరిన మృతులు

పలు: ఇండోనేషియాలోని సులవెసి ప్రాంతం పలు నగరంలో సునామీ భారీ విధ్వంసాన్ని సృష్టించింది. ఈ ప్రకృతి విలయానికి భారీగా ప్రాణనష్టం జరిగింది. ఇప్పటివరకు 384 మంది మృత్యువాత పడినట్లు అక్కడి విపత్తు ఏజెన్సీ వెల్లడించింది. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశముందని పేర్కొంది. తొలుత 48 మంది చనిపోయారని అధికారులు ప్రకటించగా.. కొద్ది గంటల వ్యవధిలోనే మృతుల సంఖ్య అమాంతం పెరిగిపోయింది. సునామీ బీభత్సంతో వందలాది మంది గల్లంతయ్యారు. సముద్రపు

తరువాయి 2లో..

## నా వల్లే 2014లో టీడీపీ గెలిచింది : పవన్



పశ్చిమగోదావరి: జనసైనికులపై దాడి చేస్తే ఊరుకోమని జనసేన అధినేత పవన్ కల్యాణ్ హెచ్చరించారు. చింతలపూడిలో జరిగిన సభలో పవన్‌కల్యాణ్ మాటాడుతూ ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. తనకు భద్రత కల్పిస్తామని చంద్రబాబు అంటున్నట్లు తనకు తెలిసిందన్నారు. గతంలో తనకు కల్పించిన సెక్యూరిటీని ఇంటెలిజెన్స్‌గా

తరువాయి 2లో..

## కుట్రలో భాగంగానే దాడులు

### ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమా?..

### కేసీఆర్‌కు రేవంత్ సవాల్



హైదరాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్రలో భాగంగానే తనపై ఐటీ దాడులు జరిగాయని తెలంగాణ కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. రెండు రోజులపాటు తనపై ఐటీ దాడులు జరిగిన నేపథ్యంలో హైదరాబాద్‌లోని నివాసంలో రేవంత్ మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ అభద్రతాభావానికి గురవుతున్నారని, ప్రగతిభవన్‌లో భయంతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారని ఆయన అన్నారు. మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు తెరాస నేతలు కాంగ్రెస్ నేతలపై దాడులకు దిగుతున్నారని ఆరోపించారు. ప్రసార మాధ్యమాల్లో వచ్చిన కథనాలపై తెలంగాణ సమాజానికి వాస్తవాలు చెప్పాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు.

జూబ్లీహిల్స్‌లో ఉన్న ఇంటిని తన

తరువాయి 2లో..

## ఆ ఇద్దరికీ ఓటేస్తే కమలానికి వేసినట్టే : లోకేశ్



తాడేపల్లిగూడెం: రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న కేంద్రంలోని భాజపా ప్రభుత్వాన్ని..మోదీ దత్త పుత్రుడు పవన్ కల్యాణ్, అవినీతి పుత్రుడు జగన్ ఒక్క మాట కూడా అనరని ఏపీ మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. జగన్, పవన్‌లకు ఓటేస్తే అది కమలానికే చేరుతుం దన్నారు. శనివారం పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఏర్పాటు చేసిన తెదేపా ధర్మపోరాట సభలో ఆయన మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం అన్యాయం చేస్తుందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో భాజపాకు ఒక్క సీటు కూడా గెలవలేని పరిస్థితి ఉన్నా.. జాతీయ పార్టీతో పొత్తు పెట్టుకుంటే రాష్ట్రానికి న్యాయం జరుగుతుందని భావించామన్నారు. ప్రత్యేక హోదాతో పాటు విభజనచట్టంలోని 18 హామీలు నెరవేరుస్తారనే నాడు

తరువాయి 2లో..

### శబరిమలపై సుప్రీం తీర్పుపై

## శివసేన తీవ్ర అసంతృప్తి

*వ్యతిరేకంగా వచ్చే నెల 1న కేరళలో 12 గంటల పాటు సమ్మె*

న్యూఢిల్లీ: వయసుతో నిమిత్తం లేకుండా మహిళలందరికీ శబరిమల ఆలయంలోకి ప్రవేశం కల్పిస్తూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుపై శివసేన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ తీర్పునకు వ్యతిరేకంగా వచ్చే నెల 1న కేరళలో బంద్ చేపట్టాలని నిర్ణయించింది. సోమవారం 12 గంటల పాటు సమ్మె నిర్వహిస్తామని ప్రకటించింది. కేరళలోని శబరిమల ఆలయంలోకి 10 నుంచి 50 ఏళ్ల లోపు మహిళల ప్రవేశంపై ఉన్న నిషేధాన్ని సుప్రీంకోర్టు శుక్రవారం ఎత్తివేసిన సంగతి తెలిసిందే. దైవత్వాన్ని సాధించే మార్గంలో అసమానతలు తగవు. అయ్యప్ప భక్తుల్లో పురుషులు, మహిళలు అనే వర్గీకరణ కూడదు.... అని ఈ సందర్భంగా సుప్రీం

తరువాయి 2లో..

### ప్రజల సమస్యలపై భరోసానిస్తూ

## సాగిన పాదయాత్ర

**జననేతకు తమ ఆవేదనను వ్యక్తంచేసిన గొడికొమ్ము గ్రామ మహిళలు**

**కన్నీటి పర్యంతమయిన జిందాల్ ఫ్యాక్టరీ నిర్వాసితులు**



ఎస్.కోట(విజయనగరం): రాష్ట్రంలో అవినీతి, అరాచక పాలనకు వ్యతిరేకంగా ప్రజల పక్షాన నిలుస్తూ ప్రతిపక్ష నేత, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పయాత్ర విజయనగరంలో సాగిపోతోంది. శనివారం ఉదయం జననేత 273వ రోజు పాదయాత్రను లక్కవరపు కోట మండలం కిర్లా నుంచి ప్రారంభించారు. దారి పొడవునా మంగళహారతులు. ప్రజా

తరువాయి 2లో..






## వార్డు...వార్డులో వైయస్సార్ నేతల యాత్ర



విజయనగరం: శనివారం వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వై.యస్.జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన " ప్రజాసంకల్పయాత్ర " ను విజయవంతం చేయాలని వై.యస్.ఆర్.కాంగ్రెస్‌పార్టీ విజయనగరం నియోజకవర్గం నాయకులు అవనాపు విక్రమ్, అవనాపు విజయ్‌లు స్థానిక 7,9,34,35,36,37 వార్డులలో ప్రజాసంకల్పయాత్రకు సంబందించిన కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో అవనాపు సోదరులు మాట్లాడుతూ సోమవారం జరిగే పాదయాత్ర మరియు పైడితల్లి అమ్మవారి గుడి దగ్గర జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వైయస్.జగన్ మోహన్‌రెడ్డికి స్వాగతం పలికేందుకు మహిళలు , యువకులు, వృద్దులు అన్నివర్గాల ప్రజలు ఉత్సాహంతో వున్నారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ సీనియరు నాయకులు పిళ్ళా విజయ్‌కుమార్, కాళ్ళ గౌరీశంకర్ మరియు మ్యునిస్పల్ కౌన్సిలర్లు గాడు అప్పారావు, శ్రీమతి పిలకాదేవి, శ్రీమతి గంటా చినతల్లి, మాజీ కౌన్సిలర్లు శ్రీమతి మంచాల శివాని, శ్రీమతి పొట్నూరు పద్మ, శ్రీమతి ఎర్రంశెట్టి సునీత, శ్రీమతి దుక్క లక్ష్మి, పిన్నింటి చంద్రమౌళి, పొట్నూరు వెంకటి, పార్టీనాయకులు శ్రీమతి కలపర్తి లక్ష్మి, చందక రమణ,ముళ్ళు త్రినాధ్, పిలకా శ్రీను, పిళ్లా రామకృష్ణ, పతివాడ సత్యనారాయణ, ప్రసాద్ ప్రభు, సుంకర నారాయణరావు, దొంతల రమణ, బాలియోగి, బలగం సత్తిబాబు, రౌతు చంటి, పృధ్వి, కోట్ల పైడిరాజు, వెంకట్, నడుపూరు వెంకటరమణ, దత్తి సోమునాయుడు, వంకర గురుమూర్తి, లెంక అప్పలరాజు, పడగల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా అమ్మవారి పందిరరాటమహోత్సవం



విజయనగరం:ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవ సంబరాల్లో ముఖ్యమైన ఘట్టానికి శనివారం అంకురార్పణ జరిగింది. అమ్మవారి సిరిమానోత్సవాలకు సంబందించి పందిరిరాట మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. చదురుగుడి వద్ద శనివారం ఉదయం 8గంటల 40నిమిషాలకు ఎమ్మెల్యే మీసాలగీత, ఎమ్మెల్సీ గాదెశ్రీనివాసులనాయుడు, మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రసాదుల రామకృష్ణల ఆధ్వర్యంలో పందిరిరాట మహోత్సవం నిర్వహించారు. వేదపండితులు శంబర శంకర శర్మ ఆధ్వర్యంలో మంత్రోచ్చరణలతో ప్రత్యేకపూజలు నిర్వహించి పందిరిరాట వేసారు.ఈ సంధర్భంగా ఎమ్మెల్యే మీసాలగీత మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రజల ఆరాద్యదైవం పైడితల్లి అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా పందిరిరాట మహోత్సవం నిర్వహించామని, నేటి నుంచి పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంటుందన్నారు. ఉత్సవాల నిర్వహణ కు మున్సిపాలిటీ అధికారులు ఇతర శాఖల సమన్వయంతో పనిచేస్తూ సిరిమాను సంబరాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

# అక్టోబర్ 20 నుంచి విజయనగర ఉత్సవాలు



విజయనగరం: అక్టోబర్ 20వ తేదీ నుండి 22వ తేదీ వరకు మూడు రోజుల పాటు విజయనగరం ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా చేపట్టి ఘనంగా నిర్వహించాలని సంయుక్త కలెక్టర్ కె.వెంకటరమణరెడ్డి అన్నారు. శనివారం వివిధ కమిటీలు, జీవిత సభ్యులు, జిల్లా అధికారులతో కలక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉత్సవ నిర్వహణ ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని కోరారు. జిల్లా నలుమూలల నుండి విచ్చేసే సందర్శకులకు వి.యనగరం రాచరిక, విద్యా, సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఉత్సవాలు ఉండాలన్నారు. నిర్వహణకు అయోధ్యా మైదానం, ఆనందగజపతి ఆడిటోరియం, క్షత్రియ కళ్యాణ మండపం, కోట, గురజాడ కళాభారతి, విజ్జిస్టేడియం, సంస్కృతిక కళాశాలు వేదికలు కానున్నాయి. 20వ తేదీన ఉదయం కోట కూడలి నుండి అన్ని రంగాలకు చెందిన కళాకారులు, ప్రజలు విద్యార్థులు, అధికార, అనధికారులతో ఆనందగజపతి ఆడిటోరియం వరకు ర్యాలీ నిర్వహించాలని తెలిపారు. ఉత్సవాల ప్రారంభ కార్యక్రమంతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు మూడు రోజులు నిర్వహించాలని జిల్లాలో ప్రముఖులను సత్కరించాని తీర్మానించారు. ఉత్సవ జీవిత సభ్యులతో డిఆర్‌డిఎ ప్రాజక్ట్ డైరక్టర్ కార్య్రకమాల బాధ్యత వహించాలన్నారు. ముగింపు ఉత్సవాలు అయోధ్యామైదానంలో నిర్వహించాలని అందులో భాగంగా పెద్దఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అక్కడ డ్వాక్రా బజారు, ఫుడ్‌ఫెస్టివల్, వివిధ ప్రభుత్వ శాఖల స్టాల్స్, ప్రభుత్వ పథకాలపై షార్ట్ ఫిలిం.పెట్ షో ఏర్పాటుచేయాలన్నారు. ఉత్సవ జీవిత సభ్యుల సహకారంతో ఏపిఓ, సోషల్ వెల్ఫేర్ డిడిలకు బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. క్షత్రియ కళ్యాణమండపంలో పశు, ఫలాల ప్రదర్శన నిర్వహించాలని ఉద్యానవన శాఖ ఉప సంచాలకులకు ఉత్తర్వులు ఇచ్చారు. కోటలో సైన్స్ ఫైయిర్, స్టాంపుల, నాణేల ప్రదర్శన. ఆర్ట్ గేలరీ, ఐసిడిఎస్,ఎస్.ఎస్.ఎ, పిడిలు, డిఇఓనిర్వహించాలని కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. గురజాడ కళాభారతిలో నాటక ప్రదర్శనలు బాధ్యతెస్.సి.కార్పరేషన్ ఇ.డి.కి ఇచ్చారు. విజ్జిస్టేడియంలో ఆటల పోటీలు సెట్విజ్ బాధ్యత సిఇఓకు ఇచ్చారు. సంస్కృతిక కళాశాలలో పుస్తకాల ప్రదర్శన, అవధానాలు, ఛాయా చిత్ర ప్రదర్శనలు ఏర్పాటుచేయాలని ప్రిన్సిపల్‌ను ఆదేశించారు. ముఖ్యకూడళ్లలో లైటింగ్ ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమీషనర్‌కు ఆదేశాలు ఇచ్చారు. అదేవిధంగా పోస్టర్లు, హోర్డింగులు, సావనీర్, ఆహ్వాన పత్రికలు ముద్రణ కమిటికి జిల్లా పర్యాటక అధికారికి, ముఖ్యఅతిధుల ఆహార, వసతి సౌకర్యాలు, జెడ్పీ సిఇఓకు, డిపిఓకు, జిల్లా మేనేజర్లు కమిటీ పర్యవేక్షించాలని తెలిపారు. స్వాగత ద్వారాల ఏర్పాటు గృహనిర్మాణ శాఖ పి.డి.కి, ఉత్సవ ప్రచారం, ఛాయాచిత్ర ప్రదర్శన డిపిఆర్ఓ ఏడికి, త్రాగునీరు, పారిశుధ్యం ఐల్యాండ్ల సుందరీకరణ మాన్సాస్ సిఇఓ ఆధ్వర్యంలో కమిటీ పర్యవేక్షించాలన్నారు. 11 ప్రభుత్వ శాఖల స్టాళ్ళను ఏర్పాటు చేసే బాధ్యత డ్వామ పిడికి అప్పగించారు. ఉత్సవాల లోగో, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం, జిల్లా ఇన్‌ఫర్మేటిక్ అధికారి అవసరమైన చోట్ల బారికేట్లు ఆర్ అండ్ బి ఎస్.ఇ, ప్రోటోకాల్ పార్వతీపురం ఆర్‌డిఓ నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ జె.వెంకటరావు, సిపిఓ జె.విజయలక్ష్మి, సోషల్ వెల్ఫేర్ ఉప సంచాలకులు సునీల్ రాజ్‌కుమార్, డిఆర్‌డిఎ డ్వామా, ఐసిడిఎస్ పిడిలు కె.సుబ్బారావు, బి.రాజగోపాలరావు, వసతంబాల, డిఇఓ నాగమణి, ఎస్ఎస్ఏ పి.ఓ, ఎస్.సి కార్పరేషన్ ఇడి యం.రాజు, సమాయ కమీషనర్ కనకమహాలక్ష్మి, డిఎస్ఓ సుబ్బరాజు, ఉత్సవ జీవిత సభ్యులు కాపుగంటి ప్రకాష్, జి.శివకుమార్, ఐవిపిరాజు, ఎం.కాశీవిశ్వేశ్వరరావు, డాక్టర్ బి.యస్.ఆర్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు విధిగా మొక్కలు నాటాలి

విజయనగరం: విద్యార్థులు విధిగా మొక్కలు నాటాలని, వాటిని పరిరక్షించి ప్రాణవాయును అందించే విధంగా కాపాడాలని జిల్లా కలెక్టర్ డా.ఎం.హరిజవహర్‌లాల్ కోరారు. శనివారం స్థానిక పూల్‌బాగ్ కాలననీలో జిల్లాపరిషత్ పాఘశాలను సందర్శించారు. అక్కడ విద్యార్థినీవిద్యార్థులతో మాట్లాడారు. వారిచేత మొక్కలు నాటేంచారు. టాబూబియా, బిగ్నోనియా, స్పోధోడియా, గ్యాగారని బాదాం, ఇన్యులిన్ జమా, నిమ్మ, సుమారు 60 మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ పి.వేణుగోపాలరావు, డిఇఓ నాగమణి, తదితర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## కరపత్రాలతో హోరెత్తిస్తున్న ప్రచారం



విజయనగరం: ఈ నెల 30న వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న ప్రజాసంకల్పయాత్ర విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రవేశించి 1వ తేదీ సోమవారం సాయంత్రం పట్టణంలోని శ్రీ పైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగించనున్నారు. పాదయాత్రను , బహిరంగ సభను విజయవంతం చేయాలని పట్టణపార్టీనాయకులు కనుగల రాజా నాయకత్వంలో గాజులరేగలో ఇంటింటికి వెళ్ళి ప్రజలకు కరపత్రాల ద్వారా విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కర్రోతు వెంకటరావు, నడిపిల్లి ప్రసాద్, కనుగుల రాజా, బూడి రాంబాబు, కెల్ల అరుణ, ఇజ్జిరోతు అప్పలరాజు, పత్తిగిల్లి మోహనసాయి, తాళ్లపూడి అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

## రెండోవిడత ఇళ్లకు పారదర్శకంగా డ్రా

విజయనగరం : ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా పట్టణంలోని సారిపల్లి వద్ద నిర్మించిన ఇళ్లకు సంబంధించి రెండోవిడత డ్రా ప్రక్రియ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహిస్తామని మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల రామకృష్ణ, కమిషనర్ టి.వేణుగోపాల్ తెలిపారు. శనివారం సాయంత్రం చైర్‌పర్సన్ చాంబర్‌లో డ్రా కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లుపై మున్సిపల్ కౌన్సిలర్లు, ఏపీ టిడ్కో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సారిపల్లికి సంబంధించి 2280 ఇళ్లకు గాను మొదటి విడతలో 1363 ఇళ్లను డ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. అలాగే అక్టోబర్ 1వ తేదీన ఉదయం11 గంటలకు రెండోవిడత డ్రా ద్వారా మిగిలిన ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. మొదటివిడత డ్రాలో తలెత్తిన సమస్యలను గుర్తించామని, రెండోవిడతలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలను తీసుకున్నామన్నారు.

లబ్ధిదారులు ఎక్కువ సమయం క్యూలో నిలబడకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసామన్నారు. అలాగే డ్రా కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చే లబ్ధిదారులకు భోజనసదుపాయం కల్పించామన్నారు.

కార్యక్రమానికి సుమారు మూడువేల మంది వరకు వస్తారని అంచనా వేస్తున్నామన్నారు. అందుకు తగ్గట్టు సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు.

డ్రా కార్యక్రమం విజయవంతం అవ్వడానికి అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, టిడ్కో అధికారి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛతవైపు అడుగు ముందుకు వేద్దాం

విజయనగరం:స్వచ్ఛతవైపు ఒక అడుగు ముందుకు వేద్దామని విజయనగరం మునిసిపల్ కమీషనర్ టి.వేణుగోపాల్ అన్నారు. స్వచ్ఛ పక్వాడా పేరిట కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా విజయనగరం జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో శనివారం ఉదయం మహాకవి గురజాడ అప్పారావు స్వగృహం వద్ద జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహాత్మాగాంధీ కలలు కన్న భారతదేశాన్ని సాకారం చేయాలని, పరిశుభ్రమైన భారతదేశానికి నాంది పలకాలని అన్నారు. ఈ సందర్భంగా ప్రతీ సంవత్సరంలో 100 గంటలు, ప్రతీ వారానికి 2 గంటలు శ్రమదానం చేసి పరిశుభ్ర ఆంధ్రప్రదేశ్ సాధించే సంకల్పానికి కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా పర్యాటక శాఖాధికారి పి ఎన్ వి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ స్వచ్ఛ పక్షంను గొప్ప అవకాశంగా భావించి ప్రతీ ఒక్కరూ స్వచ్ఛతవైపు అడుగువేయాలని పిలుపునిచ్చారు. ఈ రోజు నుండి 100 మందితో 100 గంటలు సమయాన్ని కేటాయించేలా ప్రతీ ఒక్కరూ మరొకరిని ప్రేరేపించాలని అన్నారు. అనంతరం గురజాడ స్వగృహం వద్ద స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేపట్టారు.

మొదటి పేజీ తరువాయి

## ఏపీకి తీవ్రమైన అన్యాయం చేశారు

ఏర్పాటు చేస్తున్నారు. పార్లమెంట్‌లో మన ఎంపీలు కేంద్రాన్ని నిలదీశారు. ప్రాంతీయ పార్టీ అవిశ్వాస తీర్మానం పెట్టడం దేశ చరిత్రలో నూతన అధ్యాయం. రాష్ట్రం కోసం పోరాడితే కటకటాలు తప్పవని వైకాపా ఎంపీలు పారిపోయి వచ్చారు. మోదీ ప్రభుత్వం అవినీతిపరులను కాపాడుతోంది. రాజకీయ, స్వార్థ ప్రయోజనాల కోసం రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నారు. హక్కుల కోసం పోరాటం చేస్తున్నాం.. అంతిమంగా గెలిచేది ధర్మం, న్యాయమే.

**ప్రపంచ అత్యుత్తమ నగరాల్లో అమరావతి నిలుస్తుంది**

దేశంలో అందరికంటే అభివృద్ధిలో ముందంజలో ఉన్నాం. మానవ హక్కులు సాధించుకునే శక్తి మనకు ఉంది. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. అమరావతి మన కలల రాజధానిగా ఉండాలి. అమరావతిని దేశంలో అన్ని నగరాల కంటే ఆదర్శంగా తీర్చిదిద్దుతాం. అన్న క్యాంటీన్లు పెట్టాం, అక్టోబరు 2 నుంచి నిరుద్యోగ యువతకు రూ.వెయ్యి భృతి ఇవ్వబోతున్నాం. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం అని చంద్రబాబు వెల్లడించారు.

ఈ సభలో రాష్ట్ర మంత్రులు చినరాజప్ప, కళా వెంకట్రావు, లోకేశ్, దేవినేని ఉమామహేశ్వరరావు, సుజయకృష్ణ రంగారావు, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, తెదేపా నేతలు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలపై భరోసానిస్తూ సాగిన పాదయాత్ర

సమస్యల తోరణాలు, వినతులు, విజ్ఞప్తులతో జననేత పాదయాత్ర ప్రారంభ మైంది. నైట్‌క్యాంప్ వద్ద రాజన్న బిడ్డను చూడటానికి, మాట్లాడటానికి, పాదయాత్రలో తాము భాగం కావాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల, ప్రజలు ఉదయం నుంచే పెద్దఎత్తున తరలివచ్చారు.

అక్కడి నుంచి జామి మండలంలోని జిడ్డేటివలస క్రాస్, గొడికొమ్ము, అలమండ క్రాస్, గజపతి నగరం నియోజకవర్గ పరిధిలోని అలమండ సంత, లొట్టపల్లి క్రాస్, యాతపాలెం, కొత్త భీమసింగి, పాత భీమసింగి వరకు నేటి ప్రజాసంకల్పయాత్ర కొనసాగనుంది.

ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పయాత్ర విజయనగరం జిల్లాలో దిగ్విజయంగా కొనసాగుతోంది. ప్రజాసంకల్పయాత్ర ఎస్.కోట నియోజకవర్గంలో విజయవంతంగా పూర్తి చేసుకొని గజపతినగరం నియోజకవర్గంలోకి ప్రవేశించింది. జననేతకు ఆ పార్టీ సీనియర్ నేతలు బొత్స సత్యనారాయణ, అప్పలనర్సయ్య, నియోజకవర్గ ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. దీంతో కొత్త వలస-విజయనగరం రోడ్డు జనసంద్రంతో నిండిపోయింది.

అంతకముందు ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ఎలాంటి అభివృద్ధి చేయటం లేదని, నియోజకవర్గ సమస్యలు అస్సలు పట్టించుకోవడంలేదని ఎస్.కోట నియోజకవర్గ ప్రజలు జననేతకు చెప్పుకున్నారు. టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించిందని, స్థానిక సమస్యలను ఎమ్మెల్యే లలిత కుమరి పట్టించుకోవడం లేదని జామి మండల మైనారిటీలు జననేత దృష్టికి తీసుకెళ్లారు. తమను అక్రమంగా తొలగించారిన జామి మండల ఫీల్డ్ అసిస్టెంట్లు వైఎస్ జగన్‌కు పిర్యాదు చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని ఫీల్డ్ అసిస్టెంట్లు జననేతకు వినతి పత్రం సమర్పించారు. (జగన్‌తో నడిచిన ఎస్వీ కృష్ణారెడ్డి, అచ్చిరెడ్డి)

జననేతను కలిసిన జిందాల్ నిర్వాసితులు

దివంగత నేత వైఎస్సార్ తర్వాత తమను పట్టించుకునేవారే లేరని జిందాల్ ఫ్యాక్టరీ నిర్వాసితులు వైఎస్ జగన్ ముందు కన్నీటి పర్యంతమయ్యారు. ప్రజాసంకల్పయాత్రలో భాగంగా రాజన్న తనయుడిని జిందాల్ ఫ్యాక్టరీ నిర్వాసితులు, రైతులు టీడీపీ దుర్మార్గపు పాలనలో ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఫ్యాక్టరీ పెట్టకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, జిందాల్ భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని రైతుల వైఎస్ జగన్‌ను కోరారు. ప్రజల సమస్యలను ఓపిగ్గా విన్న జననేత వారికి భరోసానిస్తూ ముందుకు కదిలారు. పార్టీ కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు మండుటెండను సైతం లెక్క చేయకుండా జననేత వెంట పాదయాత్రలో పాల్గొన్నారు.

## శబరిమలపై సుప్రీం తీర్పుపై శివసేన తీవ్ర అసంతృప్తి

చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా వ్యాఖ్యానించారు. కాగా సుప్రీం తీర్పు తీవ్ర నిరాశ కలిగించిందని శబరిమల ప్రధాన అర్చకుడు కందరారు రాజీవరు చెబుతున్నారు.

## కుట్రలో భాగంగానే దాడులు

కుటుంబసభ్యులు కొనుగోలు చేశారని తెలిపారు. 2014లో బ్యాంకు ద్వారా రుణాలు తీసుకోవడమే కాకుండా నిర్మాణానికి రుణాలు తీసుకున్నారని వెల్లడించారు. బినామీ పేర్లతో వ్యాపారాలు చేసినట్లు తనపై ఆరోపణలు చేస్తున్నారని.. మలేసియా, సింగపూర్‌లో వ్యాపారాలు చేసినట్లు పేర్కొంటున్నారని మండిపడ్డారు. ఆయా దేశాల్లో ఖాతాలు తెరవాలంటే ఆ దేశ పౌరుడై ఉండాలని వివరించారు. తన కుటుంబాన్ని క్షోభకు గురిచేసే విధంగా మీడియాలో వార్తలు వస్తున్నాయని రేవంత్ ఆవేదన వ్యక్తం చేశారు. 2009, 2014లో తాను ఈసీ ముందు పొందుపరిచిన ఆస్తుల వివరాలు పోల్చి చూడాలని కోరారు. 2009 తర్వాత తాను ఎక్కడా ఆస్తులు కొనుగోలు చేయలేదని ఆయన స్పష్టం చేశారు. గోపన్‌పల్లి, వట్టినాగులపల్లి, కొండారెడ్డి, కొడంగల్‌లో ఆస్తులన్నీ ఎన్నికల అఫిడవిట్‌లో పొందుపరిచామని వివరించారు. తనకు పిల్లను ఇచ్చిన మామ కిరోసిన్ హోల్‌సేల్ డీలర్ అని.. 1992 కంటే ముందే ఆయనకు హైదరాబాద్‌లో భూములు ఉన్నాయని రేవంత్ వివరించారు. కుట్రలను తిప్పికొట్టడానికి పగలు, రాత్రి అనే తేడా లేకుండా తనకు అండగా ఉన్న పార్టీ కార్యకర్తలకు రేవంత్ ధన్యవాదాలు తెలిపారు. ఇలాంటి సమయంలో తనకు మద్దతుగా నిలిచిన పార్టీ నేతలు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, జానారెడ్డి, పొన్నం, డీకే అరుణ, కోమటిరెడ్డి సోదరులు తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కేసీఆర్ కుటుంబసభ్యులకు సవాల్..

తన ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమని రేవంత్ ప్రకటించారు. అయితే కేసీఆర్ కుటుంసభ్యులు కూడా దీనికి సిద్ధమా? అంటూ సవాల్ విసిరారు. మన ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణ కోసం ప్రధాని మోదీకి లేఖ రాద్దాం. లేఖ రాసేందుకు 24 గంటలు సమయం ఇస్తున్నా. 24 గంటల్లో నా సవాల్‌కు బదులు ఇవ్వకుంటే కేసీఆర్ అవినీతి పరుడని ప్రజలకు అర్థమవుతుంది అని రేవంత్ అన్నారు.

## నా వల్లే 2014లో టీడీపీ గెలిచింది : పవన్

ఉపయోగించుకోలేదా? అని నిలదీశారు. ఇటీవల హైదరాబాద్‌లో ఉన్న తన ఇంటిపై డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టలేదా? అని ప్రశ్నించారు. దీనిపై జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశామన్నారు.

తాను సినిమా హీరోను కానని, ఉద్యమ కారుడనని చెప్పారు. ప్రాణభయంతో రాజకీయాల్లోకి రాలేదని చెప్పారు. జిల్లాలో రౌడీ ఎమ్మెల్యేలు ఉన్నారని, వారిని తరిమికొడతామన్నారు. తన వల్లే 2014లో టీడీపీ గెలిచిందన్న సంగతి నేతలు గుర్తించుకోవాలన్నారు. 2014లో తన అవసరం లేకుంటే మా ఇంటికి ఎందుకొచ్చారని పవన్ అడిగారు.

## ఆ ఇద్దరికీ ఓటేస్తే కమలానికి వేసినట్టే : లోకేశ్

పొత్తు పెట్టుకున్నామనీ, నాలుగేళ్లు ఎదురుచూసినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రత్యేక హోదాకు మించిన ఆర్థికసాయం చేస్తామని నమ్మించి.. మిగతా రాష్ట్రాలకు ప్రత్యేక హోదా కొనసాగిస్తూ ఏపీకి నమ్మకద్రోహం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. చంద్రబాబుది ధర్మపోరాటమైతే.. మోదీది అధర్మపోరాటమన్నారు. న్యాయం చేయమని అడిగితే బాబ్లీ కేసును తెరపైకి తీసుకొచ్చి ఇబ్బందులు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తెదేపా జోడెద్దుల బండి అని, ఓవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలతో ముందుకెళ్తున్నామన్నారు. రైతులకు రూ.24వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. యువ నేస్తం కింద నిరుద్యోగులకు అక్టోబర్ 2 నుంచి రూ.1000 చొప్పున నిరుద్యోగ భృతి చెల్లించనున్నట్టు తెలిపారు. జగన్ పార్టీ అద్భుతమైన డ్రామాకంపెనీ అని, కేంద్రంతో రాజీపడి రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రత్యేక హోదాతో పాటు 18 హామీలు నెరవేర్చినవారినే ప్రధానిని చేస్తామని లోకేశ్ చెప్పారు.

## హరీశ్‌రావుకు తప్పిన ప్రమాదం

పెట్టారు. బాణసంచా పొగల్లో హరీశ్‌రావు చిక్కుకున్నారు. వెంటనే అప్రమత్తమైన ముగ్గురు గన్‌మెన్లు వచ్చి ఆయనకు రక్షణగా నిలిచారు. అనంతరం మంత్రిని అక్కడి నుంచి తీసుకెళ్లారు.

# సునామీ బీభత్సం

అలలు సుమారు 6 మీటర్ల ఎత్తు వరకు ఎగిసినట్లు ఇండోనేషియా మీడియా వర్గాలు వెల్లడించాయి. సునామీ బీభత్సం సృష్టించిన పలు నగరంలో సుమారు 3.50లక్షల మంది జనాభా ఉన్నారు. ఈ నగరంలో బీచ్ ఫెస్టివల్ నిర్వహణకు ఏర్పాట్లు చేసుకుంటున్న సమయంలో రాకాసి అలలు ఒక్కసారిగా విరుచుకుపడ్డాయి. కొన్నిచోట్ల మృతదేహాలు పలు నగర వీధుల్లో తేలియాడుతున్నట్లు అక్కడి అధికార వర్గాలు పేర్కొన్నాయి. సునామీ బీభత్సంతో పెద్దసంఖ్యలో ప్రజలు గాయపడ్డారు. ఆస్పత్రులన్నీ క్షతగాత్రులతో నిండిపోయాయి. తమ కుటుంబీకుల యోగక్షేమాలు తెలియక రోదిస్తున్న వారితో పలు నగరంలో భీతావహ వాతావరణం నెలకొంది.

# ఐఎస్‌పిఏస్ జాతీయ అధ్యక్షునిగా ఆచార్య కె.శ్రీనివాస రావు

## - ఏయూ ఆచార్యునికి అరుదైన గౌరవం



విశాఖపట్నం : ఇండియన్ సొసైటీ ఫర్ ప్రోబబులిటీ అండ్ స్టాటస్టిక్స్ (ఐఎస్‌పిఏఎస్) జాతీయ అధ్యక్షునిగా ఏయూ స్టాటస్టిక్స్ విభాగం సీనియర్ ఆచార్యులు కె.శ్రీనివాస రావు ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. ఈ మేరకు ఐఎస్‌పిఏఎస్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆచార్య వి.హెచ్ బజాజ్ ఉత్తర్వులను ఆచార్య శ్రీనివాసరావుకు పంపారు. జాతీయ స్థాయిలో స్టాటస్టిక్స్ నిపుణుల సమాఖ్యగా ఐఎస్‌పిఏ నిలుస్తుంది. దేశవ్యాప్తంగా పరిశ్రమలు, పరిశోధన సంస్థలు, విశ్వవిద్యాలయాలలో పనిచేస్తున్న స్టాటస్టికల్ నిపుణులు ఐఎస్‌పిఏలో సభ్యులుగా ఉన్నారు. ఆచార్య కె.శ్రీనివాస రావు 2019 జనవరి 1వ తేదీన ఐఎస్‌పిఏఎస్ నూతన అధ్యక్షునిగా పదవీ బాధ్యతలను స్వీకరిస్తారు. రెండు సంవత్సరాలు ఆయన పదవిలో ఉంటారు. ప్రతీ సంవత్సరం ఐఎస్‌పిఏఎస్ జాతీయ స్థాయిలో సదస్సులు నిర్వహించడం, స్టాటస్టిక్స్‌ను ప్రోత్సహించడం, ఐఎస్‌పిఏస్ జర్నల్స్‌ను ముద్రించడం జరుగుతుంది. వీటితో పాటు ప్రాజెక్టులు, కన్సల్టెన్సీలను నిర్వహిస్తారు. ఆచార్య కె.శ్రీనివాస రావు ఏపిసెట్ మెంబర్ సెక్రటరీగా, ఏపి ఆర్‌సెట్ కన్వీనర్‌గా సేవలు అందిస్తున్నారు. ఏయూకి నాక్ స్టీరింగ్ కమిటీ సభ్యునిగా, యూజీసీ సమన్వయకర్తగా, ఐఎస్ఓ సమన్వయకర్తగా, స్టాటస్టిక్స్ విభాగాధిపతిగా, బిఓఎస్ చైర్మన్‌గా, యూజీసీ డిఆర్ఎస్ శాప్ సమన్వయకర్తగా పనిచేశారు. ఆపరేషనల్ రీసెర్చ్ సొసైటీ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షునిగా సైతం సేవలు అందిస్తున్నారు. ఐఎస్‌పిఏస్ చీఫ్ ఎడిటర్‌గా ఎనిమిది సంవత్సరాలు సేవలు అందించారు.

ఓపిసెర్చ్‌కు, జర్నల్ ఆఫ్ స్టాటస్టిక్స్ అండ్ అప్లికేషన్స్‌కు అసోసియేట్ ఎడిటర్‌గా సేవలు అందించారు. ఆచార్య శ్రీనివాస రావు పర్యవేక్షణలో 47 మంది పరిశోధనలు జరిపి డాక్టరేట్‌లు అందుకున్నారు.

195 విశిష్ట పరిశోధన పత్రాలను జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురించారు. ఆచార్య శ్రీనివాస రావు డిస్టింగ్విష్డ్ స్టాటస్టీషియన్ అవార్డును అందుకున్నారు.

ప్రతీ సంవత్సరం ఐఎస్‌పిఏస్ బెస్ట్ స్టాటస్టీషియన్ అవార్డును ఆచార్య సి.ఆర్ రావు పేరుతో, బెస్ట్ థీసిస్ అవార్డు, యంగ్ స్టాటస్టీషియన్ అవార్డు, డిస్టింగ్విష్డ్ స్టాస్టీషియన్ అవార్డులను అందిస్తుందన్నారు. డిసెంబర్ 27 నుంచి 30 వరకు జాతీయ సదస్సు హర్యానాలోని మీరట్‌లో జరుగుతుందన్నారు.

# వెబ్‌జర్నలిస్టుల సమస్యలు పరిష్కారానికి కృషి

## *- 16న విశాఖలో రాష్ట్రస్థాయి సమావేశం - జిల్లా నూతన కార్యవర్గం ఏర్పాటు*



విశాఖపట్నం : రాష్ట్రవ్యాప్తంగా వెబ్‌జర్నలిస్టుల, ఎడిటర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జిల్లా సంఘం డిమాండ్ చేసింది. శనివారం జిల్లా కార్యవర్గసమావేశం సింహాచలంలో కొండ దిగువన నిర్వహించారు. ఈ సమావేశానికి ఎ.పి. వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి, వైజాగ్ జర్నలిస్టుల ఫోరమ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషిచేస్తున్నామన్నారు. రాష్ట్రంలో వెబ్‌జర్నలిస్టులకు అండగా వుంటామన్నారు. ఈ సందర్భంగా శ్రీనుబాబు సమక్షంలో జిల్లా నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేసింది. 16న విశాఖలో రాష్ట్రస్థాయి కమిటీని ఎన్నుకుంటామని సంఘం ప్రతినిధులు చెప్పారు.

జిల్లా నూతన కార్యవర్గం : ప్రెసిడెంటుగా వాల్మీకి నాగరాజు, ఉపాధ్యక్షులుగా ఐ. గోపినాథరావు, టి.వి.ఎన్. ప్రసాద్, సెక్రటరీగా ఎ. అమిత్, జాయింట్ సెక్రటరీలుగా కె. జనార్థన్, ఎం. శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా జి. గురుప్రసాదరావు, వర్కింగ్ సెక్రటరీగా శివాజీ (అనకాపల్లి), కోశాధికారిగా ఎస్.ఎల్.ఎన్. మూర్తి, కార్యవర్గసభ్యులుగా ఎం. తిరుపతిరావు, జి. ఈశ్వరరావు, కె. అప్పలరాజు, కె. శంకర్, కె. నూకరాజు, సిహెచ్.ఆర్.కె. రెడ్డిలు ఎన్నికయ్యారు.

# చెవిటి, మూగ విద్యార్థులకు బ్యాగులు పంపిణీ



విశాఖపట్నం : బీచ్ వాకర్స్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం లాసన్స్ బే కాలనీ శాంతి ఆశ్రమం సమీపంలో ఉన్న డెఫ్ అండ్ డంబ్ ఓంకార్ లయన్స్ స్కూల్ విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, స్వీట్స్, స్టేషనరీ సామాన్లు అందజేశారు. బీచ్‌వాకర్స్ ఫ్రెండ్స్ అసోసియేషన్ కార్యవర్గసభ్యులు చిట్టూరి శ్రీరామమూర్తి మాట్లాడుతూ చెవిటి, మూగ విద్యార్థులకు ఇటువంటి సేవాకార్యక్రమాలు నిర్వహించడం సంతోషదాయకమన్నారు.

కార్యక్రమంలో సంఘసేవకులు యెడ్ల వేణుసుమన్, వాకర్స్ అధ్యక్షులు తేలూరు అప్పారావు, కార్యదర్శి వియ్యపు శంకరరావు, సభ్యులు ఎస్.పి.వై. నాయకులు హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు వి.రాధారాణి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం బి.రామోజీలతోపాటు విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## భవిష్యభారత్, శాస్త్ర సాంకేతికరంగాలపై సదస్సు

విశాఖపట్నం; గాయత్రి విద్యాపరిషత్ మూడేళ్ళు పూర్తిచేసుకుంటున్న సందర్భంగా భవిష్య భారత్, శాస్త్ర సాంకేతిక రంగాలపై రెండురోజుల జాతీయ సదస్సును నిర్వహించనున్నట్లు కాలేజి సెక్రటరీ, కరస్పాండెంట్ డి.దక్షిణామూర్తి వెల్లడించారు. శనివారం ఎంవిపికాలనీలో కాలేజిలో ఏర్పాటుచేసిన విలేకర్లసమావేశంలో ఆయన మాట్లాడుతూ... ది ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ తిరుపతి చాప్టర్, గాయత్రివిద్యాపరిషత్ డిగ్రీ,పిజి కాలేజి(అటాపమస్) సెంట్రల్ ఆడిటోరియంలో ఈనెల 30, వచ్చేనెల1న రెండురోజులపాటు జాతీయ సదస్సును నిర్వహిస్తోన్నామన్నాం

ఈ కార్యక్రమానికి ప్రదానవక్తగా ఆచార్య జి.నాగేశ్వరరావు పాల్గొంటున్నారని తెలిపారు. సదస్సుకు దేశనలుమూలలనుండి ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు, కొల్‌కటా, లక్నో, తిరుపతి, విజయవాడ, విశాఖ ప్రాంతాలనుండి పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్‌కెవి సూర్య నారాయణరాజు, డైరక్టర్ ఎంఎఫ్ రెహ్మాన్‌లు పాల్గొన్నారు.

## కొయ్యూరు డిటిగా శ్రీధర్

కొయ్యూరు : కొయ్యూరు డిప్యూటీ తహశీల్దార్(డిటి)గా బడుగు శ్రీధర్ నియమితులయ్యారు. గతంలో ఈయన ఎక్సైజ్ సిఐగా విధులు నిర్వహించే వారు. గ్రూపు2లో ఎంపికవడంతో శ్రీధర్ డిటిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మన్యం వీరుడు నడియాడిన ప్రాంతదంలో మొదట పోస్టింగ్ రావడం ఆనందంగా ఉందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానని తెలిపారు. ఇక్కడి డిటిగా పని చేసిన ఆనందరావును గొలుగొండ బదిలీ చేశారు.

# జనవరి 8, 9 తేదీల్లో దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

## సిఐటియు నగర అధ్యక్షులు ఆర్.కె.ఎస్.వి.కుమార్ పిలుపు



విశాఖపట్నం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా 10 జాతీయ కార్మిక సంఘాలు జనవరి 8, 9 తేదీల్లో దేశవ్యాప్త సమ్మెకు పిలుపు నిచ్చాయి. మన విశాఖనగరంలో ఈ సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ రోజు సిఐటియు మద్దిలపాలెం జోన్ మహాసభ సిఐటియు కార్యాలయం వద్ద ఎ.సింహాచలం అధ్యక్షతన జరిగింది. ఈ సభకు కుమార్ ముఖ్యవక్తగా పాల్గొని మాట్లాడుతూ బిజెపి, తెలుగుదేశం ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన తరువాత కార్మికహక్కులను కాలరాసాయన్నారు. మున్సిపల్ కార్మికులకు 279 జివో తీసుకొచ్చి కార్మికులపై పని భారం మోపాయన్నారు. తోపుడుబండ్లు కార్మికులను ఎక్కడా కూడా వ్యాపారం చేసుకోనివ్వకుండా తొలగించడం, దాడులు చేస్తున్నారని ద్వజమెత్తారు. మోటార్ ట్రాన్స్‌పోర్టు కార్మికుల ఉపాధిని దెబ్బతీసే విధంగా చట్టాలను తీసుకొచ్చిందన్నారు. ఆర్టీవో, పోలీస్ అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారని తెలిపారు. బిల్డింగ్ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఉన్నా ఆ బోర్డు నుండి అమలు కావాల్సినవి అమలు చేయకుండా వెల్ఫేర్‌లో ఉన్న నిధులన్నీ చంద్రన్న భీమాకు, చంద్రన్న పెళ్లికానుకకు తరలించారన్నారు. ఇలా అన్ని రంగాల కార్మికుల సమస్యలను పరిష్కారం చేసే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లేవన్నారు. కార్మికుల పోరాటాలకు అండగా ఉంటున్న సిపిఎం, సిపిఐ పార్టీలకు సిఐటియు మద్దతు ఇస్తోందని, రాబోయే ఎన్నికల్లో వామపక్షాలను బలపర్చాలన్నారు. ఆ దిశగా అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలలో సిఐటియు చేపట్టే కార్యక్రమాల్లో అందరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

**నూతన కమిటీ ఎన్నిక :**

నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా వి.కృష్ణారావు, ఎ.సింహాచలం ఎన్నికయ్యారు. కోశాదికారిగా పి.వెంకటరావు, 16మందితో ఆఫీస్ బేరర్స్, మరో 17 మందితో కమిటీకి మహాసభ ఎన్నుకుంది.

# పరిశుభ్రత పాటించండి - ఆరోగ్యకరంగా జీవించండి

**- అపరిశుభ్ర పరిసరాలు అనారోగ్య హేతువులు - 49, 47, 21 వార్డులలో క్షేత్ర పర్యటన**

**- జ్వర పీడిత కుటుంబాలకు పరామర్శ - ఓపెన్ ప్లేసులు, కాలువల నిర్వహణ పై అసంతృప్తి**

**- ప్రజలు కాలువలలో చెత్త వేయవద్దు - సర్వయిలెన్స్ బృందాలకు సహకరించాలి**

**- ఓపెన్ ప్లేసులు ఖరాబు చేసిన వారికి నోటీసులు జారీచేయండి**

*- కమిషనర్ హరినారాయణన్*



విశాఖపట్నం :- ప్రజలు పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యకరంగా జీవించాలని జివియంసి కమిషనర్ హరి నారాయణన్ అభిలషిం చారు. క్షేత్ర పర్యటనలో భాగం గా 49, 47, 21 వార్డులలో పర్యటించి జ్వరబాధిత కుటుంబాలను పరామర్శించి బాగోగులు కనుగొన్నారు. తోలుత 49వ వార్డు హనుమాన్ టెంపుల్ వీధి, పల్లివీధి, గుల్లలపాలెంలలో పర్య టించారు. కాలువలలో పూడిక తీయడానికి వీలులేకుండా కాలువలు ఉన్నాయని, సందులలోని కాలువలను పరిశుభ్రం చేసే అవకాశం లేనందున వాటర్ క్యాన్స్ వినియోగించి పరిశుభ్రం చేయాలని ఆదేశించారు. సర్వయిలెన్స్ బృందాల పనితీరు సంతృప్తికరంగా ఉన్నట్లు భావించారు. ప్రజలు కూడా ఆరోగ్య సూత్రాలు పాటించడం, ఇంటిలోపల, బయట, పెరడులో శుభ్రత పాటించాలని సూచించారు.

ఓపెన్ ప్లేస్‌లలో చెత్త వేసి ఖరాబు చేస్తున్నవారికి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. అప్పటికి వారి నుండి స్పందన లేకుంటే జరిమాన విధించాలని పేర్కొన్నారు. అనంతరం 47వ వార్డులో ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీలో జ్వరపీడిత కుటుంబాన్ని పరామర్శించారు.

తదుపరి మూడవజోన్‌కు చెందిన 21వ వార్డు కె.జి.హెచ్ నర్సింగ్ స్కూల్‌లో శిక్షణా నర్సులు జ్వరాల బారిన పడుతుండడం వలన పరిసరాలను పరిశీలించారు.

కేర్ టేకర్ ఖాన్, కె.జి.హెచ్ పారిశుధ్య కాంట్రాక్టర్ ప్రతినిధులతో సంప్రదించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.

ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయించాలని కోరారు.పర్యటనలో నాలుగవ జోనల్ కమిషనర్ రమణమూర్తి, మూడవ జోనల్ కమిషనర్ చిట్టిబాబు, ఏ.యం. ఓ.హెచ్‌లు డా.మురళీమోహన్, డా.సుధాకర్, బయాలజిస్ట్ కె.పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

# రామ్‌నగర్ లో ఎమ్‌పిఎమ్ ట్రస్టు వైద్య శిభిరం



సాగర్‌నగర్ : రాష్ట్ర శాసన మండలి సభ్యుడు డాక్టర్ ఎమ్.వి.వి.ఎస్. మూర్తి ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఎమ్.పి.ఎమ్. ట్రస్టు ఇటీవల ఎన్‌టిఆర్ సేవా సమితి ట్రస్టుతో కలసి శనివారం 19వ వార్డు రామ్‌నగర్ సంతోషిమాత కోలనీలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.డెంగ్యూ, మలేరియా వ్యాధుల నివారణకు ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు రోగులకు వైద్యసేవలు అందించారు.పరిసరాల పరిశుభ్రత వలన కలగే ప్రయోజనాలను వివరిస్తూ స్థానికులకు పలు సూచనలు ఇచ్చారు.ఈ ఉచిత వైద్య శిబిరాల ద్వారా ప్రజలు తమ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునే వీలు కలుగుతుందని, సకాలంలో వైద్యం పొందడానికి అవకాశం ఉంటుందని ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందించడమే లక్ష్యంగా ఎమ్‌పిఎమ్ ట్రస్టు ఉచిత వైద్య శిబిరాల నిర్వహణపై దృష్టి నిలిపిందన్నారు. కలుషిత వాతావరణం కారణంగా కంటి సమస్యలతో పాటు వివిధ రకాల రోగాలతో సతమతమవుతున్న స్థానికులు ఈ వైద్య సేవలు పొందాలన్నారు.ఈ శిభిరంలో మూత్రపిండాల సమస్యలు, స్త్రీలసమస్యలు, క్షయ, మోకాళ్ళలో ఆరుగుదల, గుండె జబ్బులకు, పరీక్షలు జరిపారు.

గీతం దంత వైద్య కళాశాల ఆసుపత్రి, జిమ్‌సర్ ఆసుపత్రి వైద్య నిపుణులు, పెద్ద ఎత్తున సిబ్బంది వైద్య శిబిరాలలో పాల్గొన్నారు. కాగా శనివారం దంత పరీక్షలు 220 మందికి, కంటి వైద్య పరీక్షలు 250 మందికి, స్త్రీ సంబంధిత పరీక్షలు 280 మందికి, సాధారణ పరీక్షలు 250 మందికి నిర్వహించినట్లు ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలుగు దేశం నాయుకులు ఎం.బాబురావు, కె.వేణు, ఎస్.రాజు, ఎస్.చిన్న ట్రస్ట్ నిర్వాహకులు ఆళ్ళ శ్రీనివాసు, పి.వి.రామారెడ్డి, శంకరావు, తదితరులు పాల్గొన్నారు.

# సంతానలేమిపై అవగాహన, సమస్యల పరిష్కారం



విశాఖపట్నం: ఒత్తిడి సమాజంలో చాలా మంది సాధారంగా ఎదుర్కొనే సమస్య సంతానలేమి. ఈ విధమైన సమస్యలపై అవగాహన కల్పించేందుకు విశాఖలో అవగాహన సదస్సు నిర్వహించిందనీ లండన్ ఐవీఎఫ్ డాక్టర్ చంద్రరెడ్డి నేతృత్వంలోని బృందం ఈ రుగ్మతకు గల కారణాలను వివరించారు. ఈ సమస్యను ప్రపంచ ఆరోగ్య సంస్థ చే గుర్తించబడిందని దీని బారిన పడి చాలా మంది మానసికంగా వేదన అనుభవిస్తున్నారన్నారు. అయితే చట్టపరమైన నిబంధనలతో తగు వైద్య సలహాలు, సూచనలతో చేపట్టే ప్రక్రియ ద్వారా ఈ రుగ్మతను దూరం చేసుకోవచ్చునన్నారు. పెద్ద వయస్సులో ఉన్న వారికి సైతం కొందరికి ఈ సమస్యను దూరం చేయడం జరుగుతుందన్నారు. అది కూడా కొన్ని పరిస్థితుల్లోనే అన్నారు. పురుషుల్లో ఆధునిక జీవన సరళి, కాలుష్యం, పురుగు మందులు, మొబైల్ ఫోన్‌లకు బానిసక కావడం, మద్యంకు బానిస అవ్వడం లాంటివి ఈ రుగ్మతకు కారణమవుతాయన్నారు. విశాఖ కేంద్రంగా పలువురికి విజయవంతంగా చికిత్స చేయడం జరిగిందన్నారు. ప్రతీ కేసు విషయంలోనూ ఎటువంటి చట్టపరమైన సమస్యలు తలెత్తకుండా న్యాయ సలహాలు కూడా అందించడం జరుగుతుందన్నారు. ఈ అవగాహన సదస్సు ఈ కేంద్రం ద్వారా విజయవంతమైన ఫలితాలు పొందిన పలువురు దంపతులు పాల్గొన్నారు.

# ఘనంగా ఏయూ ఇంగ్లీష్ క్లబ్ సాంస్కృతిక వేడుకలు

## - ముగిసిన కొమిట్ 2018



ఆంధ్రవిశ్వవిద్యాలయం : ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన ది కమ్యూనికోన్స్ ఏయూసిఈ(ఏ) ఇంగ్లీష్ క్లబ్ రెండురోజుల సాంస్కృతిక, సాంకేతిక ఉత్సవం శనివారం సాయంత్రం ముగిసింది.

ఉదయం వైవిఎస్ మూర్తి ఆడిటోరియం వేదికగా స్పెల్ బి, వర్క్‌షాప్, క్విజ్, పోయట్రీ పోటీలను నిర్వహించారు. వర్సిటీ విద్యార్థులతో పాటు నగరంలోని పలు కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పోటీలలో పాల్గొన్నారు. సాయంత్రం నిర్వహించిన ముగింపు వేడుకల్లో స్వాగత నృత్యం చిన్నారి ఇషిత ప్రదర్శనతో ప్రారంభమైంది. అనంతరం విజేతలకు బహుమతుల ప్రధానం జరిపారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య పి.ఎస్ అవధాని, ఆచార్య ఇందిర తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని అభిషేక్ సమన్వయం చేశారు.

# విజయభాను సంపాదకీయం

## సామాన్యులను దృష్టిలో పెట్టుకోవాలి

పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా పెరుగుతుండటంతో సామాన్య, మధ్యతరగతి ప్రజల్లో కలవరం చెలరేగుతున్నది. డాలర్‌తో రూపాయి విలువ తగ్గడం, అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధర పెరుగడం ఇందుకు ప్రధాన కారణాలు. పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెరుగడానికి అంతర్జాతీయ కారణాలు ఉండవచ్చు. కానీ వీటి ధరలు ఆకాశాన్నంటుతున్నా, ప్రభుత్వం తమకు సంబంధం లేదన్నట్టుగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తున్నది. పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెరుగడం వల్ల సామాన్యులకే భారం కాదు. ఆ ప్రభావం మొత్తం ఆర్థిక వ్యవస్థపైనే ఉంటుంది. 2013-14 నుంచి పెట్రోల్, డీజిల్‌పై కేంద్ర ఎక్సైజ్ సుంకం భారీగా పెరిగింది. నాలుగేండ్లలో ఎక్సైజ్ సుంకం లీటర్ పెట్రోల్‌కు 9.48 నుంచి 21.48 రూపాయలు పెరిగింది. డీజిల్‌పై సుంకం 3.56 నుంచి 15.33 రూపాయలు పెరిగింది. పెట్రోల్ ధరలో దాదాపు సగం పన్ను ఉంటున్నది. రూపాయి పరిస్థితి ఎప్పుడు బాగుపడుతుందో తెలువదు. ఇరాన్‌పై అమెరికా ఆంక్షల నేపథ్యం అంతర్జాతీయ పరిస్థితి మన చేతిలో లేదు. అందువల్ల ప్రభుత్వమే తన పరిధిలో సామాన్యులకు ఊరట కలిగించడానికి ప్రయత్నించాలె. పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెరుగడానికి అంతర్జాతీయ కారణాలున్నాయి. అయితే చైనా, పాకిస్థాన్, శ్రీలంక, నేపాల్ వంటి ఇరుగు పొరుగు దేశాలకు, వర్ధమాన ఆర్థిక వ్యవస్థలకు కూడా ఇదేరీతిలో అంతర్జాతీయ కారణాలు వర్తిసాయి. అయినా అక్కడ మన దేశంలో మాదిరిగా భారీ ధరలు లేవు. మన దేశంలో కన్నా చాలా తక్కువ ధరకు పెట్రోల్, డీజిల్ ధరలు లభిస్తున్నాయి. పాకిస్థాన్‌లో ఇటీవల కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పెట్రోలియం ఉత్పత్తుల ధరలు ఇంకా తగ్గిస్తామని ప్రకటించింది. ఇంధన ధరలు ఇంతగా పెరుగుతున్నప్పటికీ, ప్రభుత్వం పన్నుల తగ్గింపు ద్వారా సామాన్యులకు ఉపశమనం కలిగించడానికి సిద్ధంగా లేదు. ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించడం కూడా లేదని సంకేతాలు అందుతున్నాయి. పెట్రోల్, డీజిల్ ధరలపై పన్నులు తగ్గించడం అసాధ్యమనే వాదన ప్రభుత్వ మద్దతుదారుల నుంచి వినబడుతున్నది. దీన్ని వారు సమర్థించుకుంటున్న తీరు గమనార్హమైనది. పెట్రోలియం ఉత్పత్తులపై ఒక రూపాయి పన్ను తగ్గిస్తే, మొత్తంగా పదమూడు వేల కోట్ల రూపాయల మేర ఆదాయం తగ్గుతుందని ఆర్థిక నిపుణులు అంటున్నారు. పెట్రోలియం ఉత్పత్తులపై పన్నులు తగ్గిస్తే, సంక్షేమ పథకాలకు కోత వేయవలసి వస్తుందని అంటున్నారు. కానీ ఆర్థిక సంస్కరణలు ప్రారంభమైన తర్వాత కొన్ని లక్షల కోట్ల రూపాయల మేర పరిశ్రమలకు పన్నుల రాయితీలను ఆయా ప్రభుత్వాలు ఇచ్చాయి. కొన్ని పారిశ్రామిక సంస్థలకు లబ్ధి సమకూర్చడానికి ప్రభుత్వం ఇంతగా తన ఆదాయానికి కోత వేసుకోవడానికి సిద్ధపడినప్పుడు, సామాన్యులతో సహా సమాజమంతటికీ లబ్ధి చేకూరే చర్యలు తీసుకోవడానికి సంకోచం ఎందుకు? ఆ లోటు పూడ్చడానికి కోట్లాది మందిని ఆదుకునే సంక్షేమ పథకాలకు కోత వేయమని ఎవరూ చెప్పరు. ఆ లోటును పూడ్చుకోవడానికి ఇతర మార్గాలు అన్వేషించాలె. ఇంధన ధరలు పెరుగడం వల్ల పడే ఇబ్బందుల నుంచి మధ్యతరగతి, సామాన్య ప్రజలు బయట పడటం కష్టంగా మారింది. ఇందుకు కారణం కూడా పాలకులు అనుసరిస్తున్న విధానా లే. ప్రభుత్వ అభివృద్ధి విధానాలు నగరాల విస్తరణకు, ప్రైవేట్ రవాణాకు అనుకూలంగా ఉన్నది. దీనివల్ల బతుకుదెరువు కోసం తెల్లారితే దూర ప్రాంతాలకు వెళ్ళక తప్పదు. ప్రభుత్వ రవాణా క్రమంగా కుంచించుకుపోతున్నది. రవాణా రంగాన్ని ప్రైవేటీకరించే పోకడ చాలాకాలంగా సాగుతున్నది. దీనివల్ల పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగినప్పుడల్లా సామాన్యులు విలవిలలాడిపోతున్నారు. ఒకప్పుడు ఎక్కడి అవసరాలు అక్కడే స్థానికంగా తీరేవి. ఇప్పుడు నిత్యావసర వస్తువులు మొదలుకొని అనేకం ఇతర ప్రాంతాల నుంచి లేదా ఇతర దేశాల నుంచి దిగుమతి అవుతుంటాయి. ఆహార పదార్థాలు స్థానికంగా దొరికినవే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వస్తున్నాయి. ఆర్థికవ్యవస్థ నిర్మాణమే ఈ విధంగా మారిపోయింది. ఈ కారణంగా ఇంధన ధరలు పెరిగినప్పుడల్లా రవాణా భారమై ఆ ప్రభావం అన్ని వస్తువుల ధరలపై పడుతుంది. ఒకప్పుడు కార్ల వంటి వాహనాలు ధనికులకే పరిమితమై ఉండేవి. దేశంలో నగర ప్రాంతాలు తక్కువ. గ్రామాల్లో బస్సు ఎక్కి ప్రయాణించడం చాలా తక్కువ మంది అనుభవం. సమీప గ్రామాలకు ఎడ్ల బండి లేదా కాలి నడక ద్వారా వెళ్ళేవారు. అంతకుమించి వెళ్ళే అవసరం చాలామందికి ఉండకపోయేది. ఆ కాలంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగితే అది ప్రజల సమస్యగా ఉండకపోయేది. కానీ ఇప్పుడు సామాన్యులను దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకోవడం అవసరం.

## మెయిన్ రోడ్‌ల పై ట్రాఫిక్ నిబంధనలు పై సమావేశం



భీమునిపట్నం : స్థానిక జోనల్ కార్యాలయం లో జోనల్ కమిషనర్ పి.దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో భీమిలి గంట స్తంభం రోడ్ మరియు తగరపు వలస మెయిన్ రోడ్ ట్రాఫిక్ నిబంధనలు పై సమావేశం జరిగింది.ఈ సమావేశం లో భీమిలి గంట స్తంభం రోడ్ల పై వ్యాపారులు చేయుచున్న వారు వారికీ కేటాయించిన షాపులలో మాత్రమే వ్యాపారం చేయాలని అట్లు కాని యెడల వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు ,అలాగే తగరపువలస ప్రాంతంలో రోడ్ ల పైన ఫుట్ పాత్ లు పైన వ్యాపారం చేయుచున్న వారు తగరపువలస మెయిన్ రోడ్ పున నిర్మాణం చేపట్టుట వలన ఈ సేవా రోడ్ నందు గల పాత కళ్యాణమండపం స్థలం నందు తాత్కాలికంగా వ్యాపారులు చేసుకోవాలని మరియు తగరపువలస మెయిన్ రోడ్ కి ఆనుకొని వున్న వ్యాపారులు త్వరలో జరుగునున్న రోడ్ లు పున నిర్మాణం దృష్ట్యా వ్యాపారస్తులు కాలువలపై అక్రమణలు స్వచ్ఛందంగా తొలగించాలని జోనల్ కమీషనర్ తెలిపారు ఇలా కానియెడల ముందస్తు నోటిసులు జా రీచేయకుండా సదరు అక్రమణలు తొలగిస్తామని తెలియజేశారు.పై తెలిపిన ప్రాంతాలలో ట్రాఫిక్ అంతరాయం కలుగుకుండా పోలీస్ సహకారం అందిస్తామన్నారని ఆయన అన్నారు.ఈ సమావేశంలో...

ట్రాఫిక్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ హిమబిందు ఎస్ ఐ రామదాసు, భీమిలి లా అండ్ ఆర్డర్ ఎస్ ఐ వాసు నాయుడు,భీమిలి జోనల్ ఎ.సి.పి కె.హరిబాబు, సానిటరీ ఇన్ స్పెక్టర్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల క్రీడా క్షేత్రాల అభివృద్ధిపనులు వేగవంతం చేయాలి

- క్రీడా క్షేత్రాల అభివృద్ధికి ఇచ్చే రూ.5లక్షలను రూ.10 లక్షలకు పెంపు

- జాయింట్ కలెక్టర్-2 ఎ.సిరి



విశాఖపట్నం : ప్రభుత్వ పాఠశాలల క్రీడా క్షేత్రాల అభివృద్ధి పనులను వచ్చే మాసం 15 కల్లా పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్-2 ఎ.సిరి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో క్రీడలు, శాప్, ఎన్‌ఆర్‌ఇజిఎస్ శాఖల అధికారులు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల అభివృద్ధి అధికారులతో ఆమె సమావేశమై క్రీడా క్షేత్రాల అభివృద్ధి పనులను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 164 ప్రభుత్వ పాఠశాలల క్రీడా క్షేత్రాల అభివృద్ధి ప్రతిపాదనలు పంపగా 121 పాఠశాలలకు అనుమతులు ఇవ్వడం జరిగిందని ఆమె తెలిపారు. ఇప్పటివరకు ఎన్‌ఆర్‌ఇజిఎస్ కన్వర్జన్సు పనులతో నిర్వహిస్తున్న పాఠశాలల క్షేత్రాల అభివృద్ధి పనులకు రూ.5లక్షలు మంజూరు చేయడం జరుగుచున్నదన్నారు. అయితే సర్వశిక్షా అభియాన్ ద్వారా నిర్వహించే ఈ పనులకు రూ.10లక్షలు చొప్పున ప్రభుత్వం మంజూరు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ పనులను అన్నింటినీ వేగవంతం చేసి వచ్చే నెల 15కల్లా పూర్తి చేయాలని సర్వశిక్షా అభియాన్ అధికారులు, మండల అభివృద్ధి అధికారులు, ప్రధానోపాధ్యాయులను ఆమె ఆదేశించారు.

ఈ సమావేశంలో దేవానంద్, జాన్ గ్యాలియట్, ఇఇ.రవిశంకర్, లింగేశ్వరరెడ్డి, మల్లికార్జునరావు, మండల అభివృద్ధి అధికారులు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## హిందీ దివాస్ పక్షోత్సవాలు



భీమునిపట్నం: ఆదర్శ హింది ప్రేమిమండలి భీమునిపట్నం అద్యక్షులు కె.ఎస్.ఆర్.కృష్ణారావు అలాగే పండిట్ నెహ్రు మునిసిపల్ హైస్కూల్ ప్రదానోపాధ్యాలు డి.ఈశ్వరరావు ఆద్వర్యంలో హిందీ దివాస్ పక్షోత్సవాలు సందర్భంగా హిందీ జాతీయ బాష దానిని నేర్చుకోవలసిన ఆవశ్యకత అనే అంశంపై వ్యాసరచన పోటిలు నిర్వహించారు. ఈ సందర్భంగా కె.ఎస్.ఆర్.కృష్ణారావు మాట్లాడుతూ దక్షిణ భారత హిందీ ప్రచార సభ ను 1918 లో మహాత్మా గాంధీ స్థాపించారని అన్నారు.అనంతరం వ్యాసరచన పోటీలలో మొదటి,రెండవ స్థానం వచ్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు ఈ కార్య క్రమంలో ఉపాధ్యాయులు నాగభూషణ్ శ్రీనివాస్ సత్తిరాజు అనురాధ పాల్గొన్నారు.

## ప్రభుత్వానికి, ప్రజలకు వారధి సాధికారమిత్రలు



మాట్లాడుతున్న చైర్ పర్శన్ అనిత

నర్సీపట్నం : ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా సాధికార మిత్రలు వ్యవహరించాలని నర్సీపట్నం మున్సిపల్ చైర్ పర్శన్ చింతకాయల అనిత అన్నారు. శనివారం ఉదయం శారదానగర్‌లోని నవనిర్మాణ సమితి భవనంలో 13, 20, 21, 22 వార్డుల సాధికారమిత్రలతో సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ సంక్షేమ పథకాలపై అవగాహన కలిగి ఉండటంతో పాటు వాటిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. 35 మంది కుటుం బాలకు ఒక సాధికార మిత్ర చొప్పున నియమిస్తున్నా మన్నారు. వారు బాధ్యతగా పని చేయాలని కోరారు.

## కవి సమయం

### డబ్బుకు లోకం దాసోహం

డబ్బు జబ్బు భలే ప్రమాదం
లోకమంతా డబ్బు చుట్టునే పరిభ్రమణం
డబ్బు తోనే జీవితమన్న భావన
డబ్బుంటేనే విజయమన్న ఆలోచనా ధోరణి
మానవులను మార్చేస్తోంది డబ్బు యంత్రాలుగా
అనుక్షణం డబ్బే లోకంగా బ్రతుకుతుంటే
మానవతా విలువలు, మమతానుబంధాలు
ఆప్యాయతలు, కుటుంబ విలువలు
అన్నీ అవుతున్నాయి సమాధి
డబ్బుకు లోకం దాసోహం
కాగితాల వెనుక మానవుల
స్వస్వరూపం మటుమాయం
నైతిక విలువలకు త్రిలోదకాలిచ్చి
అక్రమ మార్గాల వెంట సంపాదన బహు ప్రమాదం
ప్రతీ పైసా వెయ్యింతల కష్టాన్ని
వసూలు చేసి మరీ వెళుతుంది
సక్రమ మార్గమందు న్యాయార్జితం
లక్ష రెట్లు సుఖాన్ని తృప్తిని ఇస్తుంది
క్షణిక లోభాలకు తలొగ్గి
పేరాసతో డబ్బుకు కక్కుర్తి పడితే
అధ:మ పాతాళానికి పతనం

... కవిత రచన
సి.ప్రతాప్
సెల్ నెం: 90636 22665

## పంచాంగం

మాసం : భాద్రపద; తిథి : పంచమి ఉ.6.11; షష్టి రా.తె.4.29; రోహిణి రా.1.34; సా.వ.5.50ల 7.23

ఆదివారం 30-09-2018

**మేషం** : బంధువులను కలుసుకుంటారు. స్త్రీలకు షాపింగ్‌లోనూ, వాహనం నడుపుతున్నపుడు ఏకాగ్రత ముఖ్యం. రావలసిన ధనం వసూలు విషయంలో శ్రమాధిక్యత, ప్రయాసలెదుర్కొంటారు. నూతన పరిచయాలు, వాతావరణం సంతృప్తి నిస్తాయి. **వృషభం** : బ్యాంకుల్లో మీ పనుల్లో స్వల్ప ఆటంకాలు ఎదుర్కోవలసి వస్తుంది. కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు ఎదురవు తాయి. రియల్ ఎస్టేట్ రంగాల వారికి నూతన వెంచర్లు కలిసివస్తాయి. ఇచ్చి పుచ్చుకునే వ్యవహారాలు, ఒప్పందాల్లో మెలకువ వహించండి. **మిథునం** : స్త్రీలకు, గృహ వాతావరణం, సంతానం వైఖరి వల్ల చికాకులు తప్పవు. కళా కారులకు, క్రీడాకారులకు మంచి గుర్తింపు రాణింపు లభిస్తుంది. పలుకుబడి కలిగిన వ్యక్తుల పరిచయం వల్ల పనులు అనుకూలిస్తాయి. ద్విచక్ర వాహనంపై దూర ప్రయాణం మంచిది కాదు. **కర్కాటకం** :విదేశీ వస్తువుల పట్ల ఆకర్షితు లవుతారు. ప్రముఖులను కలుసు కుంటారు. బంధువుల రాకతో గృహంలో సందడి నెలకొంటుంది. మీ సంతానం ఉన్నతి కోసం కొత్తకొత్త పథకాలు రూపొందిస్తారు. స్త్రీలలో ఒత్తిడి, హడావుడి అధికమవుతాయి. **సింహం** : పోస్టల్, కొరియర్ రంగాల వారికి ఒత్తిడి, పనిభారం అధికమవుతుంది. నిరుద్యోగులకు సదావకాశాలు లభించిన సద్వినియోగం చేసుకోలేరు. ఉపాధ్యాయులకు పై అధికారుల నుంచి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. మీ కళత్ర మొండివైఖరి మీకు ఎంతో చికాకు కలిగిస్తుంది. **కన్య** : కొంతమంది మీతో సన్నిహితంగా ఉంటూనే చాటుగా అపకారం తలపెట్టేందుకు యత్నిస్తారు. చిన్ననాటి మిత్రు లను, ప్రియమైన వ్యక్తులను కలుసుకుంటారు. స్థిరాస్తిని కొనుగోలుచేయు యత్నాలు ఫలిస్తాయి. పనులు మొదట్లో మందగించినా క్రమేపీ పూర్తికాగలవు. కుటుంబీకులతో దైవ దర్శనాలు చేసుకోగలగుతారు. **తుల** : కాంట్రాక్టర్లకు కార్మికులతో సఖ్యత నెలకొంటుంది. కుటుంబ సభ్యుల వైఖరిని సమీక్షించుకుంటారు. భాగస్వామి మాటతీరు, కదలికలను గమనించడం ఎంతైనా మంచిది. **వృశ్చికం** : ఆర్థిక లావాదేవీలు, ఒప్పందాల్లో బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోవలసి ఉంటుంది. వృత్తిపరంగా ఎదుర్కొంటున్న ఆటంకాలు క్రమంగా తొలగిపోగలవు. ఒక్కోసారి మీ జీవిత భాగస్వామి మన స్తత్వం అర్థం చేసుకోవడం కష్టమవుతుంది. సభలు, సమావేశాలల్లో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకట్టుకుంటారు. **ధనుస్సు** : ఫ్యాన్సీ, స్టేషనరీ, రసాయన, సుగంధ ద్రవ్య వ్యాపారులకు శుభదాయకం. ఒంటెత్తు పోకడ మంచిది కాదని గమనించండి. ఆకస్మిక ఫీజులు, బిల్లులు చెల్లిస్తారు. పట్టు దలతో శ్రమించి అనుకున్నది సాధిస్తారు. సోదరీ, సోదరులతో ఉల్లాసంగా గడుపుతారు. కుటుంబీకుల ఆరోగ్యంలో మెళకువ అవసరం. **మకరం** : ఆర్థిక కార్యకలాపాలు సానుకూలంగా సాగుతాయి. మీ సంతానం మొండివైఖరి వల్ల చికాకులు వంటివి ఎదుర్కొంటారు. ఫైనాన్స్ వ్యాపారస్తులకు ఖాతాదారుల నుంచి ఒత్తిడి పెరుగుతుంది. నిరుద్యోగులకు తాత్కాలిక అవకాశం లభిస్తుంది. పెద్దలతో కుటుంబ విషయాలు చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటారు. **కుంభం** :కొత్త పనులు చేపట్టకుండా ప్రస్తుతం చేస్తున్న వాటిపైనే శ్రద్ధ వహిం చండి. నిరుద్యోగులకు రాత, మౌఖిక పరీక్షల్లో ఏకాగ్రత ముఖ్యం. కుటుంబ విషయాల్లో స్త్రీలకు పట్టుదల, పంతాలు మంచిది కాదు. ఉద్యో గస్తులకు హోదాతో పాటు బరువు బాధ్యతలు పెరుగుతాయి. ఉపాధ్యాయు లకు పని భారం అధికమవుతుంది. **మీనం** : గృహంలో మార్పులు, చేర్పులు అనుకూల మైన కాలం. బ్యాంకు డిపాజిట్లు, దీర్ఘ కాలిక పెట్టు బడులకు అనుకూలం. సోదరీ, సోదరుల మధ్య ఏకీభావం కుదరదు.



*గ్రేటర్ విశాఖ 24వ వార్డులో స్థానిక అంగనవాడి కార్యాలయంలో వరల్డ్ విజన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చైల్డ్ రైట్స్ పై అవగాహన కార్యక్రమా0 ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా వైయస్‌ఆర్ సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ పైడి వెంకటరమణ మూర్తి హాజరయ్యారు. చిన్నారులకు బహుమతులు అందజేశారు. అనంతరం డాక్టర్ పైడి వెంకటరమణ మూర్తి మాట్లాడుతూ చిన్నారులలు ఆరోగ్య సూత్రాలు పాటించాలి అన్నారు.ఈ వయస్సు లో పౌష్టికాహారం చాలా అవసరమని అన్నారు.ఈ ప్రాంతంలో కాలుష్యం ఎక్కువగా ఉంటుంది కాబట్టి వ్యాదులు సోకకుండా తగు జగ్రత్తలు తీసుకోవాలన్నారు , రానున్న వారంరోజుల్లో ఈ ప్రాంతంలో కళా హాస్పిటల్ ద్వారా ఉచిత వైద్య శిబిరాన్ని ఎర్పాటు చస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైయస్‌ఆర్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జాన్ వెస్లీ, వార్డ్ అధ్యక్షుడు ( నాని ),వార్డ్ మాజీ ప్రెసిడెంట్ సన్యాసిరావు, మైనార్టీ నాయకుడు షరీఫ్,నాగభూషన్,25వ వార్డ్ అధ్యక్షుడు సూరడ తాత రావు,వరల్డ్ విజన్ విశాఖ మేనజర్ చాణిక్య మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.*

## క్రికెట్‌లో కొత్త నియమాలు.!

### డక్‌వర్త్ లూయిస్‌లో మార్పు

దుబాయ్: డక్‌వర్త్ లూయిస్ పద్ధతిని సవరించడంతో పాటు కోడ్ ఆఫ్ కండక్ట్, ఐసీసీ ప్లేయింగ్ నిబంధనల్లోని మార్పులను అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ( ఐసీసీ) శనివారం విడుదల చేసింది. వివాదాస్పదంగా మారిన డక్‌వర్త్ లూయిస్(డీఎల్ఎస్) పద్ధతి నిబంధనలను సవరించింది. ఇక బాల్ టాంపరింగ్ సంబంధించిన నిబంధనలను మరింత కఠినతరం చేసింది. మారిన ఈ నిబంధనలు సెప్టెంబర్ 30 నుంచి అమల్లోకి వస్తాయని పేర్కొంది. కాగా జింబాబ్వేతో సౌతాఫ్రికా తలపడే తొలి వన్డే కొత్త నిబంధనలతో ఆడే తొలి మ్యాచ్‌గా నిలువనుంది.

ఐసీసీ 2014లో డీఎల్ఎస్ నూతన పద్ధతిని ప్రవేశపెట్టింది. ఈ పద్ధతి ప్రకారం బంతి, బంతికి వచ్చే పరుగులతో పవర్ ప్లేను పరిగణలోకి తీసుకొని విశ్లేషించి లిమిటెడ్ ఫార్మాట్‌లో విజేతను ప్రకటించేవారు. అయితే ప్రస్తుతం వన్డే, టీ20ల్లో బ్యాట్స్‌మెన్ చేసే పరుగుల సగటు మారిందని, ఈ నేపథ్యంతో ఈ పద్ధతిని కొంత మార్చినట్లు ఐసీసీ పేర్కొంది.

రోజుకి రూ. 25/- మాత్రమే Size 1x3 Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 2564353, 2569004

# విజయరామరాజుపేటలో
## పర్యటించిన సురేంద్ర



అనకాపల్లి : పట్టణంలో విజయరామరాజుపేటలో తెలుగుదేశం పార్టీ నాయకులు మళ్లసురేంద్ర శనివారం పర్యటించారు. ఎ.ఎం.సి కోలనీలో ఉన్న, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేకు సమస్యలను వివరించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని, హామీ ఇచ్చారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులు పరిష్కారానికి త్వరలోనే తగిన చర్యలు చేపడతామని చెప్పారు. సెప్టిక్ ట్యాంకు ప్రధాన సమస్యగా మారిందని త్వరలోనే చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. అధికారుల దృష్టికి కూడా సమస్యలను తీసుకువెళ్తామని సురేంద్ర చెప్పారు. ఈ కార్యక్రమంలో పిట్ల రాజు, తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణ డిగ్రీ కళాశాల
# ఫ్రెషర్స్ డే వేడుకలు



భీమునిపట్నం : తగరపువలస కృష్ణ డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు చిట్టివలస శ్రీనివాస కళ్యాణ మండపం లో ఘణంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా భోగాపురం ఎం.పి.పి కె. బంగార్రాజు మాట్లాడుతూ విద్యార్థులు చదువు తో పాటు సంస్కారం కూడా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు, గురువులను గౌరవించడం నేర్చుకోవాలని అన్నారు . జీవితంలో తల్లిదండ్రులను గౌరవిస్తే వారు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని తెలిపారు. విశిష్ట అతిథి విశాఖ జిల్లా బెస్ట్ టీచర్ అవార్డు గ్రహీత జి.సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతీవిద్యార్థి మంచి నడవడిక కలిగి ఉంటే వాళ్ళు ఎంతో అభివృద్ధి చెందుతారని అన్నారు . అనంతరం విద్యార్థులు సంస్కృతి కార్యక్రమాలు అతిదులను ఆకర్షించాయి ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ బి.నర్సింగరావు, ప్రిన్సిపాల్ జె.సతీష్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ రాజేష్ కుమార్, మహోదయ కరస్పాండెంట్ ఎం. శ్రీనివాసరావు, భీమిలి బోటనీ లెక్చరర్ సుధాకర్, టీడీపీ నాయకులు కొప్పల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీకి
## వచ్చే ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారు

విశాఖపట్నం : రాఫెల్ ఎయిర్‌క్రాఫ్ట్ కొనుగోళ్ళులో బీజేపీ చేసిన భారీ కుంభకోణం బైటపడిందని టీడీపీ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆరోపించారు. టీడీపీ ఆధ్వర్యంలో శనివారం జివియంసి గాంధీ విగ్రహం నుంచి జగదాంబ కూడలి వరకు 'రాఫెల్ డీల్-మోడీల్' పేరుతో నిరసన ర్యాలీ చేపట్టారు. బొమ్మ యుద్ధ విమానం ఆకృతి ఏర్పాటు చేసి దానితో ర్యాలీ చేసి మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వాసుపల్లి విలేకర్లతో మాట్లాడుతూ ఎందుకంటే యూపీఏ ప్రభుత్వం 560 కోట్ల రూపాయలకు బెంచ్ మార్కు ఫిక్స్ చేసుకుని 126 ఎయిర్‌క్రాఫ్ట్‌లు కొనవలసిన డబ్బుతో బీజేపీ ప్రభుత్వం ఆ జీవోను రద్దు చేసి అదే డబ్బుతో క్యాబినెట్ అప్రూవల్ లేకుండా కేవలం 36 ఎయిర్ క్రాఫ్ట్‌లు కొంటున్నారని అన్నారు. ఈ 36 ఎయిర్‌క్రాఫ్ట్‌లు కొనడానికి 1690 కోట్లు పడిందని అన్నారు. అయితే 560 కోట్లు ఎక్కడా? 1690 కోట్లు ఎక్కడా? ఇంత పెద్ద స్కాం? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ చేసిన రాఫెల్ అతిపెద్ద కుంభకోణం 2019లో పెద్దతీర్పు ఇవ్వబోతుందని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పుచ్చా విజయకుమార్, రాష్ట్ర గొర్రెల, మేకల ఫెడరేషన్ డైరక్టర్ 37వవార్డు అధ్యక్షుడు గంకల అప్పారావు, నున్న నాగేంద్ర, బుచ్చా రామిరెడ్డి, బంటుపల్లి సూర్యనారాయణ, అల్లూరి సత్య నారాయణరెడ్డి, లక్ష్మీ శివప్రసాద్, నజీర్, అధిక సంఖ్యలో కార్యకర్తలు, మహిళా నేతలు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జనంలో బాలునిపై దాడి
## పోలీస్‌స్టేషన్ ముందు ధర్నా

రావికమతం : మండలంలో గల కొత్తకోటలో శుక్రవారం రాత్రి జరిగిన వినాయక ఊరేగింపులో బాలునిపై దళిత యువకులు దాడి చేయడంతో బాలుని కుటుంబ సభ్యులు, స్నేహితులు న్యాయం కోరుతూ కొత్తకోట పోలీస్‌స్టేషన్ ముందు శనివారం ఉదయం ధర్నా చేశారు. శుక్రవారం రాత్రి శివాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జనం గర్రెడ్డి వారి కోవెల వద్దకి చేరుకొని సరికి మల్లేటి రాజు అతని అనుచరులు గొడవకు ప్రయత్నించగా నిర్వాహకులు అడ్డు తగలడంతో ఘర్షణ జరిగింది. దీంతో అడ్డూరి సత్తిబాబు(15) అదే బాలుడిపై రోడ్లతో దాడి చేయడంతో తలకు తీవ్ర గాయమైంది. దీంతో పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. మల్లేటి రాజు అతని అనుచరులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రోలుగుంట, మాకవరపాలెంపోలీసలు బందోబస్తు నిర్వహించారు.

## గ్రామ పంచాయితీల అభివృద్ధికి సంబంధించిన
# కార్యాచరణ ప్రణాళికను తయారుచేసుకోవాలి



విశాఖపట్నం: గ్రామ పంచాయితీల అభివృద్ధికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను తయారుచేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ సంబంధిత మండలా ధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గ్రామ పంచాయితీ అభివృద్ధి ప్రణాళిక (జిపిడిపి) పై జిల్లా పంచాయితీ వనరుల కేంద్రం నిర్వ హించిన శిక్షణా తరగతుల కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 2వతేదీ మహాత్మా గాంధీ 150వ జయంతోత్సవాలలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పంచాయితీ రాజ్ సంస్థలు చేపడుతున్న అభివృద్ధి పనులపై గ్రామ సభలను డిసెంబర్ 15వతేదీ వరకు నిర్వహిం చడం జరుగుతుందన్నారు. ఆ కాలంలో జిల్లావ్యాప్తంగా అన్ని మండలాలలో గ్రామ సభలను నిర్వహించాల్సి వుంటుం దన్నారు. అక్టోబర్ 2న గ్రామ సభలను ప్రారంభించాలన్నారు.

**క్రీడా మైదానాల నిర్మాణాలను వేగవంతం చేయండి**

అన్ని మండలాలలోనే ఎస్ఆర్ఇజిఎస్ కన్వర్జెన్స్ ద్వారా చేపడుతున్న క్రీడా మైదానాల నిర్మాణ పనులను వేగవంతం చేయాల్సిందిగా జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఎంపిడివోలను ఆదేశించారు. ఈ క్రీడామైదానంలో 4 రకాల క్రీడలకు సంబంధించి 200 మీటర్ల ట్రాక్, వాలీబాల్, కోకో, కబడ్డీ కోర్టులను తప్పనిసరిగా పూర్తి చేయాల్సి వుంటుందన్నారు. పూర్తి నాణ్యతా ప్రమాణాలతో క్రీడా మైదానాలను నిర్మించాలన్నారు.

**ఆదరణ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక వేగవంతం చేయండి**

ఆదరణ పథకాలకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాల మేరకు వెనుకబడిన తరగతులవారికి ఆర్థిక సహాయం అందించేందుకు ఎంపికైన లబ్ధిదారులకు వారు కోరుకున్న ఆధునిక పనిముట్ల పంపిణీ కొరకు వారు పెట్టుకున్న దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా పంపాలన్నారు. అన్ని మండలాల ఎంపీడీవోలు వారికి నిర్దేశించిన లక్ష్యాలను వేగవంతంగా పూర్తి చేయాల్సిందిగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు. బిసి కార్పొరేషన్ ఇడి గీతాదేవి పాల్గొన్నారు.

ఈ సమావేశంలో డిపిఒ కృష్ణకుమారి, ఏఒ శ్రీనివాసరావు, నాగలక్ష్మి, రవికుమార్, ఎంపిడివోలు,ఇఒఆర్‌డిలు, ఎపియంలు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యాన వన పరిశోధనా కేంద్రం భూసేకరణలో అవకతవకలు



అనకాపల్లి : ఉద్యాన వన పరిశోధనాకేంద్రం కోసం చేపట్టిన భూసేకరణలో జరిగి అవకతవకలపై వెంటనే చర్యలు తీసుకోవాలని జనసేన నాయకులు కొణతాల సీతారాం డిమాండ్ చేసారు. మండలంలో సంపతిపురం పంచాయితీ టి. వెంకుపాలెం గ్రామంలో రైతులను కలిసి మాట్లాడారు గ్రామంలో ప్రభుత్వం ఉద్యాన వన పరిశోదనా కేంద్రం కోసం సర్వే 67, 68లో 100 ఎకరాలు భూమి సేకరిస్తూ జారీ చేసిన, లబ్దిదారుల జాబితాలో అవకతవకలు జరిగాయన్నారు. వెంటనే రీ సర్వే జరిపించి భూమి హక్కులో ఉన్న నిజమైన సాగుదారులైను గుర్తించి న్యాయం చేయాలని అన్నారు. గ్రామ సభ నిర్వహించి, ప్రకటించిన సాగుదారుల, లబ్దిదారుల జాబితాలో అధికారులు, అనధికారులు పూర్తిగా అవకతవకలు పాల్పడడం జరిగిందన్నారు. సుమారు 40 మంది భినామీ లబ్దిదారులను అందులో చేర్చడం జరిగిందని చెప్పారు. రూపొందించిన జాబితాను రద్దుచేసి, బినామీ దారులను తొలగించాలని, విజ్ఞప్తి చేసారు. బీనామీదారులను నమోదు చేసిన విఆర్వో సంబందింత అధికారులపై చర్యలు తీసుకోవాలని, ఈ సందర్భంగా డిమాండ్ చేసారు. సాగులో ఉండి, భూమి హక్కులో ఉన్న 20 మంది రైతులను జాబితాలో చేర్చడం జరగలేదని, వెంటనే కలెక్టర్ జోక్యం చేసుకుని భూమి రి సర్వే చేసి నిజమైన లబ్దిదారులకు రైతులకు న్యాయం చేయాలని కోరారు. లేకుంటే జనసేన పార్టీ తరపున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, జనసేన కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబునాయుడే మళ్లీ ముఖ్యమంత్రి
## - సిద్ధమై వున్న ప్రజలు... - స్వాతి కృష్ణారెడ్డి



విశాఖపట్నం: రాబోయే ఎన్నికల్లో చంద్రబాబునాయుడుని తిరిగి ముఖ్యమంత్రిగా చేసేందుకు ప్రజలు సిద్ధంగా వున్నారని తెలుగుదేశం పార్టీ నాయకులు, పర్యావరణ ప్రేమికులు, స్వాతి ప్రమోటర్స్ ఛైర్మన్ మేడపాటి కృష్ణారెడ్డి భావించారు. 35వవార్డు కైలాసపురం డిసిబి కల్యాణ మండపంలో తెలుగుదేశం పార్టీ బూత్ కమిటీ సభ్యులకు సబ్సిడీపై స్మార్ట్ మొబైల్ ఫోన్లు పంపిణీ కార్యక్రమం స్వాతి ప్రమోటర్స్ సౌజన్యంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ప్రజా సంక్షేమమే కోసం, అందిస్తున్న పథకాలను ప్రజల వద్దకు తీసుకువెళ్ళాల్సిన బాధ్యతను ఆయన గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకు వెళ్ళాల్సిందన్నారు.

బూత్‌స్థాయిలో చేపట్టే కార్యక్రమం తప్పని సరిగా అటు పార్టీకి, ఇటు శ్రేణులకు మంచి గౌరవాన్ని తీసుకు రాగలదని భావించారు. 35వవార్డు బూత్ కమిటీ సభ్యులు గొర్లి పార్వతి, ఎం.ఆనంద్, ఎ.కాశీరత్నం, జి.నీలకంఠశ్వేరరావు, కె.మేఘ నాథ్, మైలపల్లి శ్రీను, జి.ధరు వారికి స్వాతి కృష్ణారెడ్డి స్మార్ట్ మొబైల్ ఫోన్స్ పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమం 35వవార్డు అధ్యక్షులు కొల్ర కన్నారావు, సెక్రటరీ ఎరిపల్లి అప్పారావు తదితరుల ఆధ్వర్యంలో జరిగింది.

# వాడవాడలా భారీ అన్న సమారాధనలు
## పూజల్లో పాల్గొన్న పెందుర్తి వైసీపీ ఇన్‌ఛార్జి అధీప్‌రాజ్



సబ్బవరం: వినాయకచవితి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా పెందుర్తి నియోజకవర్గం పరిధిలోని రాంపురం, లగిశెట్టుపాలెం, యాతపాలెం గ్రామాల్లో శనివారం వినాయక ఆలయాల వద్ద నిర్వహించిన అన్న సంతర్పణ కార్యక్రమంలో పెందుర్తి నియోజకవర్గం వైసీపీ ఇన్‌ఛార్జి అన్నంరెడ్డి అధీప్‌రాజ్ అనకాపల్లి పార్లమెంట్ సమన్వయకర్త వరుదు కల్యాణి పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా లగిశెట్టుపాలెం గ్రామంలో వినాయ కుడుకు పెందుర్తి నియోజకవర్గం వైసీపీ ఇన్‌ఛార్జి అధీప్‌రాజ్ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం భారీ అన్న సమారాధన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నం పరబ్రహ్మ స్వరూపమని ఇటువంటి కార్యక్రమాల వలన భక్తుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని అన్నారు. ఆధ్యాత్మిక భావం అలవర్చుకోవాలని భక్తులను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసిసెల్ అధ్యక్షుడు కొటాన రాము, వనం అచ్చంనాయుడు, తుంపాల అప్పారావు, సురేష్, శరగడం రాము, మహలక్ష్మినాయుడు, కొటాన వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



## సీతారాంను ఆశ్వమేధంపై
# ఊరేగిస్తున్న ప్రజలు



అనకాపల్లి : జనసేన నియోజకవర్గ నాయకులు కొణతాల సీతారంకి నానాటికీ ప్రజాదారణ పెరుగుతుంది. అనకాపల్లి మండలంలో కొండుపాలెం పంచాయితీ చేనుల అగ్రహారం గ్రామంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా, కొణతాల సీతారాం హాజరయ్యారు. ముందుగా ఈయనకు గ్రామ ప్రజలు స్వాగతం పలికి, అశ్వమేదంపై ఊరేగిస్తూ గ్రామంలోకి తీసుకువెళ్లారు. ఈసందర్బంగా సీతారాం మాట్లాడుతూ గ్రామ ప్రజలకి ఏ కష్టం వచ్చినా జనసేన పార్టీ అండగా ఉంటుందని బరోసా ఇచ్చారు. గ్రామస్తులు గ్రామంలో ఉన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అందులో భాగంగా స్మశాన వాటికలో బోరు వేయించాలని గ్రామస్తులు కోరారు. అలాగే పేద విద్యార్థులకు స్కూలుకు వెళ్లడానికి సైకిళ్లు ఇవ్వాలని కోరారు. దానికి స్పందించిన సీతారం తన సొంత నిధులతో స్మశాన వాటికలో బోరు వేయిస్తానని అలాగేపేద విద్యార్థులకు సైకిళ్లు ఇస్తానని, హామీ ఇచ్చారు.

# వారసత్వధృవపత్రానికి
## సంవత్సరం తిప్పతారా



కార్యాలయం ముట్టడించిన దృశ్యం

నర్సీపట్నం : సంవత్సరకాలంగా వారసత్వ దృవీకరణ పత్రం ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్న రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిహెచ్‌పిఎస్ ఆధ్వర్యంలో శనివారం తహాశీల్దార్ కార్యాలయం ముట్టడించారు. బలిఘట్టం ఎస్సీ కాలనీకి చెందిన కోడి బెన్నేసు యొక్క తండ్రి గవిరేషు 23.07.2017లో మరణించాడు. అప్పటి నుంచి నేటి వరకూ దరఖాస్తును పరిష్కరించకుండా కార్యాలయం చుట్టూ తిప్పుతూ జీవనాధారానికి లేకుండా చేస్తున్నా రెవెన్యూ సిబ్బంది ఇకనైనా సమస్య పరిష్కరించాలని డిహెచ్‌పిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. పలుమార్లు గ్రామంలో విచారణకు వచ్చిన అధికారులు శనివారం కార్యాలయానికి రమ్మన్నారు. కార్యాలయంలో అధికారులు కనీసం సమాధానం కూడా చెప్పడం లేదు. సుమారు 30 మంది ఆడమగ కలిసి అరుస్తున్నా పట్టించుకోవడం లేదు. రెవెన్యూ సిబ్బందికి లంచాలు ఇవ్వలేని స్థితిలో ఉన్నా దళితులను వేధింపులకు గురి చేయడం ఆపాలని కోరారు.



కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న బాధితుడు

# దసరాకు ఆదరణ పథకం అందజేత

నాతవరం : దసరాకు ఆదరణ పథకం లబ్ధిదారులకు అందజేయనున్నట్లు ఎంపిపి శింగంపల్లి సన్యాసిదేముడు అన్నారు.శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలానికి 918 దరఖాస్తులు చేసుకోగా 885 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. 10శాతం డిడి తీసి ఎంపిడిఒ కార్యాలయానికి అందజేయాలన్నారు. ఈ యూనిట్లను దసరాకు అందిస్తామన్నారు. మండల కేంద్రంలో రూ.25 లక్షలతో కళ్యాణ మండపానికి నిధులు మంజూరు అయిందన్నారు. ఈ కార్యక్రమంలో తాండవ జలాశయ ఛైర్మన్ పారుపల్లి కొండబాబు, మండల టీడీపీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ ఉన్నారు.




DMK ITI (p)
TRADES: Electrician & Fitter Scholorship for Eligible Candidates
Note: అతి తక్కువ ఫీజులకు సీటు ఇవ్వబడును
Sabbavaram, Visakhapatnam (Dt.) 531035
Contract: 83090 08289

APOSS (ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఓపెన్ స్కూల్)
Direct: SSC & Inter (Any group) One Sitting pass Guarantee, DMK Junior College, Sabbavaram, Visakhapatnam (Dt). 531035
Contact: 9441426955, 7396221464

SREE KUSUMA HARANATH COLLEGE OF EDUCTION (D.ED.,)
2017-19 Batch సీట్లు అతి తక్కువ ఫీజులకు ( 1 సం. కలిసొచ్చును )
2017-19 Batch సీట్లు కూడా అతి తక్కువ ఫీజులకు ఇవ్వబడును.
Sabbavaram, Visakhapatnam (Dt.) 531035
Contact: 9441426955, 7396221464

## "నిత్య జీవితంలో ఐఒటి అనువర్తనాలు" - కార్యశాల



విశాఖపట్నం: సెంచూరియన్ విశ్వవిద్యాలయం, గిడిజాలలో శనివారం ఉదయం ఐఒటి ఛాలంజ్ అను అంశంపై కార్యశాల జరిగింది. సియుటిఎం ఉప అధ్యక్షులు, ఆచార్య డిఎన్ రావు సదస్సును ప్రారంభించారు. ఉపకులపతి ఆచార్య జిఎస్ఎన్ రాజు సదస్సుకు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిధి డిఎన్ రావు ప్రసంగిస్తూ దైనందిన జీవితంలో ప్రతి పరికరము, వస్తువులు సరళీకరింపబడ్డాయని ఉదాహరణకు ఆకర్షణీయ స్మార్ట్ వ్యవసాయం, స్మార్ట్ బస్సు, స్మార్ట్ కార్, స్మార్ట్ వస్తువులు, కాంతినిచ్చు స్మార్ట్ బల్బులు, స్మార్ట్ బిల్డింగ్లు మొదలగునవి జీవన గమనమునే మార్చి వేస్తున్నాయని కనుక విద్యార్థులు మారుతున్న సాంకేతికలు అందిపుచ్చుకోవాలన్నారు. కార్యశాలలో వివిధ యూనివర్సిటీలు, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఐఐటి ముంబై నుండి శిక్షణ నిమిత్తం అధ్యాపకులు వచ్చారు. కార్యశాలలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులను ఐఐటి ముంబై పంపుతారు. ఉపకులపతి ఆచార్య జిఎస్ఎస్. రాజు విద్యార్థులు ఐఒటిపై (ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్) అవగాహన పెంచుకొని కొత్త ఉపయోగాలు కనుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డా॥ పి. పల్లవి, డీన్ ఆచార్య రమణారావు, కార్యశీల సమన్వయకర్త డా॥ వంశి, డా॥ సన్నీదయాల్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

## మైక్యూర్ ఆసుపత్రి చే వరల్డ్ హార్ట్ డే ర్యాలీ మరియు అవగహన సదస్సు




విశాఖపట్నం: వరల్డ్ హార్ట్ డే సందర్భంగా, విశాఖపట్నంలో గల మైక్యూర్ ఆసుపత్రియొక్క హృద్రోగ చికిత్స వైద్య నిపుణుల బృందం నేతృత్వంలో విశాఖ సాగరతీరాన గొప్ప ర్యాలీని నిర్వహించారు. ఇందులో భాగంగా గుండెకు సంబందించిన వ్యాధులు , తీసుకోవలసిన జాగ్రత్తలు మరియు ప్రస్తుతము అందుబాటులో వున్న అధునాతన వైద్యసేవలను ప్రముఖ కార్డిఓలోజిస్ట్ డాక్టర్ జి.రవి కుమార్ గారు ప్రజలకు తెలియజేసారు. ఈ ర్యాలీలో విశాఖపట్నానికి చెందిన ఎన్.అర్.ఐ అకాడమీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మై హార్ట్ , యువర్ హార్ట్ అను నేపథ్యంతో జరిగిన ర్యాలీలో మైక్యూర్ ఆసుపత్రి సిబ్బంది , డాక్టర్లు , విద్యార్థులు హోరెత్తిన నినాదాలతో బీచ్ రోడ్ లో 3 కి.మి వాక్ ను కొనసాగించారు. హార్ట్ ఎటాక్ కి సంబందించిన ఎటువంటి లక్షణాలనైనా ఎవలోనైనా గుర్థించినట్లైతే తక్షణమే సి.పీ.అర్. పద్ధతి ద్వారా ప్రథమ చికిత్సను అందిస్తూ దగ్గరలోవున్న ఆసుపత్రికి తరలించాలని కోరారు. అలాగే ప్రతిఒక్కరు సి.పీ.అర్ చేయడము తెలుసుకోవాలని సూచించారు.అలాగే వయసుతో సంబంధములేకుండా ప్రతిఒక్కరు తమ జీవన శైలిలో చేసుకునే కొన్ని మార్పులతోనే ఎన్నో రకములైన హృద్రోగాలు మరియు స్ట్రోకులనుంచీ కాపాడుకుంటూ నాణ్యమైన జీవితాన్ని ప్రతిఒక్కరు పొందగలరని అభిప్రాయపడ్డారు. యుక్త వయస్కులనుంచే మంచి, చెడు అలవాట్ల గురించి అవగాహనను కల్పించడంలో తల్లితండ్రుల పాత్ర ఎంతోప్రాధాన్యతని కూడుకున్నదని అలాగే ప్రతిఒక్కరు తగు వ్యాయామం, సరైన పౌష్టిక ఆహారం, నిర్దిష్ట సమయాలలో వైద్య పరీక్షలను చేయించుకోవడము ప్రస్తుత కాలములో ఎంతో అవసరమని సూచించారు. ఈ ర్యాలీలో ఆసుపత్రి ప్రతినిధులు శ్రీ మహేష్ దెగ్లోర్కర్ , శ్రీమతి పద్మజలు పాల్గొని తమ ఆసుపత్రిలో 24×7 గుండెకు సంబందించిన వైద్యసేవలను పిల్లలనుంచి వయోవృదుల వరకు అందిస్తున్నారని తెలిపారు. ఎన్.టీ.అర్ వైద్య సేవలద్వారా వైద్యాన్ని పెద్దఎత్తున ప్రజలకు కల్పిస్తున్నట్టు తెలిపారు. ఎటువంటి మెడికల్ ఎమర్జెన్సీ కైనా 0891 304 4501 / 7702432111 నంబర్లను సంప్రదించగలరని ప్రజలను కోరారు.

## శ్రీనివాస్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో ప్రజాసంకల్ప సభ



విశాఖపట్నం: వైఎస్ఆర్సిపి అధినేత 3000 కిలోమీటర్లు పూర్తి అయిన సందర్భంగా శనివారం తూర్పు నియోజకవర్గంలో సమన్వయకర్త శ్రీనివాస్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో భారీ బహిరంగసభ కొత్త వెంకోజిపాలెం గ్రామసేవా సంఘం ఆధ్వర్యంలో జరిగింది.

నియోజకవర్గంలో నలువైపుల నుంచి అశేషజనం మధ్య కార్యక్రమం జరిగింది. స్థానిక ప్రజల మధ్య ప్రజాసంకల్పసభలో పార్టీ విధివిధానాలు చర్చించారు. అనంతరం ప్రతిజ్ఞ చేసి ప్రజలకు సేవాకార్యక్రమాలు చేస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఎంవివి సత్యనారాయణ, పార్లమెంటరీ అధ్యక్షుడు వైనాల విజయకుమార్, ఫరూఖి, ఎం. అప్పారావు, నడింపల్లి కృష్ణంరాజు, పి. విజయచంద్ర, ఎం. రామకృష్ణ, కె.ఆర్. పాత్రుడు, బోని శివరామకృష్ణ, సునీల్, రవి, రవిరెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులపై తేనెటీగల దాడి

యానాం: సావిత్రినగర్ ప్రధాన రోడ్డు మార్గంలో విధినిర్వహణ ముగించుకుని ఇంటికి తిరిగివస్తున్న ఉపాధ్యాయులపై తేనెటీగలు దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. శనివారం సాయంత్రం దరియాలతిప్ప హైస్కూల్ హెచ్ఎం నక్కా వాసుదేవరావు, ఉపాధ్యాయులు మోర్త నాగరాజు, మేడా సత్యనారాయణలు మోటారు వాహనంపై వస్తుండగా ఇసుకకాలువ సమీపంలో తేనెటీగల గుంపు వీరిపై ఒకసారిగా దాడిచేసి గాయపరిచాయి. ఈదాడిలో పలువురు గాయపడ్డారు. వీరిని స్థానికులు హుటాహుటిన యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్సచేయించారు. తేనెటీగల దాడి గత రెండు రోజులుగా ఈ మార్గంలో జరుగుతుందని ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్ళిన ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో ఈ మార్గంలో వెళ్ళేవారు తేనెటీగల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇకనైన ఈ తేనెటీగల బారీన పడుకుండా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరారు.

## వికలాంగుల హక్కులకు భంగం కలిగించవద్దు

### అశ్రయ జిల్లా వికలాంగుల సమాఖ్య డిమాండ్

కాకినాడ : భారత రాజ్యాంగం వికలాంగులకు కల్పించిన హక్కులకు భంగం కలుగుతుందని, న్యాయపరమైన తమ హక్కులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భంగం కలిగించవద్దని ఆశ్రయ జిల్లా వికలాంగు సమాఖ్య డిమాండ్ చేసింది. శనివారం స్థానిక ఆర్అండ్బీ అతిథిగృహంలో సమాఖ్య అధ్యక్షుడు పి.సురేష్కుమార్ పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. తమ సమాఖ్య తరుపున గ్రామస్థాయి నుంచి వికలాంగులకు హక్కుల మీద, ప్రభుత్వ పథకాలపై పూర్తి అవగాహనను కల్పించడం జరుగుతుందన్నారు. వికలాంగుల సమస్యలను పరిష్కరించడానికి కమిటీలు నియమించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కొత్తగా వచ్చిన జివో ప్రకారం తమకు కేవలం 1శాతం మాత్రమే పెంచడం జరిగిందన్నారు. కాని పెంచిన 14 రకాలు ఆర్థోపెడిక్లో ఉండటం వల్ల శారీరక వికలాంగులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. శారీరక వికలాంగుల రోస్టర్ 56వ స్థానంలో ఉండటం వల్ల ప్రభుత్వ ఉద్యోగాలకు దూరం కావల్సి వస్తుందని విచారం వ్యక్తం చేసారు. రోస్టర్ పాయింట్ను 10లోపే పెట్టేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. స్పెషల్ టీచర్లను నియమించాలనీ డిమాండ్ చేసారు. అర్హులైన వికలాంగులందరికీ ఉచిత ఇల్లు మంజూరు చేయాలని, పెన్షన్ కనీసం రూ.3000లు ఇవ్వాలని, రాజకీయ రిజర్వేషన్ కల్పించాలనీ, మానసిన వికలాంగులకు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలని, వికలాంగ ప్రభుత్వ ఉద్యోగులకు సిపిఎస్ విధానం రద్దు చేయాలని, వికలాంగులపై దాడులు చేస్తున్న వారిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని, ఆన్లైన్ విధానాన్ని రద్దు చేయాలని, వికలాంగులకు ట్రై సైకిల్స్ను విరివిగా మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేసారు. ఈ సమావేశంలో ఎం.దుర్గారావు, జి.సీతామహాలక్ష్మి, టి.రాజబాబు, ఎం.శ్యామల, జి.సరోజిని తదితరులు పాల్గొన్నారు.

## అగ్రహారంలో అన్నదానం

యానాం: వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకొని అగ్రహారంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం ఉదయం అగ్రహారం దానమ్మదేవాలయం వద్ద ఆ గ్రామ పెద్దల ఆధ్వర్యంలో అన్న సమరాదన కార్యక్రమాన్ని నిర్వహించారు. యానాం, పరిసర ప్రాంతాల నుండి భక్తులు, ప్రజలు తరలివచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతియేటా వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని గ్రామ పెద్దలు తెలిపారు.

## నర్సింగ్ కోర్సులకు దరఖాస్తులు

యానాం: ఎఎన్ఎం నర్సింగ్ కోర్సులలో ప్రవేశం కొరకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు మథర్ దెరిసా పోస్టు గ్రాడ్యుషన్ నర్సింగ్ ఇనిస్ట్యూట్ కోర్సు కోఆర్డినేటర్ సవరం ప్రకష్ తెలిపారు. ఎఎన్ఎం కోర్సును 2018-19 విద్యా సంవత్సరానికి సంబంధించి నిర్వహించే విధంగా కేంద్ర నుంచి అనుమతులు జారీ అయినట్లు పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు ప్రకటించారన్నారు. రెండు సంవత్సరాలపాటు కొనసాగే ఈ కోర్సులకు ఇంటర్ మీడియట్ ఉత్తీర్ణులైన అన్ని గ్రూపుల విద్యార్థులు అర్హులన్నారు. ఈ మేరకు ఆసక్తిగల విద్యార్థులు సెల్ నెంబర్ 9030150604 సంప్రదించాలన్నారు.

## అవినీతిమయంగా ఉపాధి హామీ పథకం

### తూ తూ మంత్రంగా ఎంక్వేరీ

కొత్తపల్లి: కేంద్ర ప్రభుత్వం వలస కూలీల కోసం నిరుపేదల కోసం పట్టెడన్నం పెట్టాలనే ఉద్దేశంతో మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం చేపట్టి రోజుకు 200 కూలి వచ్చేలా చేపట్టగా నాయకులు అండదండలతో ఫీల్డ్ అసిస్టెంట్లు మెట్ల సాయంతో ఈ పథకాన్ని నీరుగారుస్తున్నారని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు కొత్తపల్లి మండలం ఎండపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు చేతివాటంతో అవినీతి జరిగిందని మచ్చ వెంకట సుబ్రహ్మణ్యం ఆరోపించగా దీనిపై ఎంక్వైరీ వేయగా కేవలం తూతూమంత్రంగా జరిగింది కోమారాగ గిరి పంచాయితీలో నీతి జరిగిందని ఆటోడ్రైవర్లకు విదేశాల్లో ఉన్న వారికి విద్యార్థులకు పనికిరాని వాళ్ళకి పనికి వచ్చినట్లుగా మాస్తర్లో మాయాజాలం చూపి ఫీల్డ్ అసిస్టెంట్ చేతివాటంతో కోటిన్నర అవినీతి చేశారని కోమారాగిరి ఎం పి టి సి కాండేపల్లినూకరాజు ఆరోపించగా దీనిపై వేసిన ఎంక్వయిరీ కూడా తూతూమంత్రంగా జరగడం గమనార్హం దీనిపై గండేపల్లి నూకరాజు మాట్లాడుతూ స్థానిక నాయకుల అండదండలతో అవినీతికి పాల్పడుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని చోటా నాయకులు అండదండలతో పేదవారికి అన్నం పెట్టవలసిన పథకం నీరుగారుస్తున్నారని నూకరాజు ఆవేదన చేస్తున్నారు.

## ఆరోగ్యానికి క్రీడలు తప్పనిసరి

### ఉపముఖ్యమంత్రి చినరాజప్ప



పెద్దాపురం: ఆరోగ్యానికి క్రీడలు అత్యంతకీలకమైనవని, ప్రతివిద్యార్థి విద్యాతోపాటు, క్రీడలు కూడా అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఉపముఖ్యమంత్రి, హోంమంత్రి చినరాజప్ప అన్నారు. శనివారం స్థానిక మహారాణి కళాశాలలో పెద్దాపురం నియోజకవర్గ ఎపిసిఎం కప్పు-2018 క్రీడలను ఉపముఖ్యమంత్రి ప్రారంభించారు. క్రీడల వలన మానసిక ప్రశాంతతోపాటు, ఆరోగ్యం, క్రమశిక్షణ అలవడుతుందని అన్నారు. ఈ పోటీలలో 14 నుండి 18 సంవత్సరాలు వయస్సుగల విద్యార్థులు 14 పాఠశాలల నుండి సుమారు 300 మంది పాల్గొంటారన్నారు. కబడ్డీ పోటీలతో క్రీడలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఇందిర ఆశాలత పీటర్, వైస్ ప్రిన్సిపాల్ వీరయ్యచౌదరి, ఆర్గనైజింగ్ సెక్రటరీ టివిఎస్ రంగారావు, మాజీ వైస్ చైర్మన్ సత్యభాస్కర్ 14 పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 1న పుదుచ్చేరి పోలీసు ఆవిర్భావదినోత్సం

యానాం: కేంద్ర ప్రాలిత ప్రాంతమైన పుదుచ్చేరి పోలీసు శాఖ 55 సంవత్సరాలు పూర్తిచేసుకున్న నేపథ్యంలో అక్టోబర్ 1న పుదుచ్చేరి పోలీసు ఆవిర్భావదినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్పి నితిన్ గోహల్ తెలిపారు. స్థానిక జిఎంసి బాలయోగి క్రీడామోదానంలో వివిధ పోలీసు దళాల నుండి గౌరవ వందనం స్వీకరించి 5 రోజులపాటు వివిధ గ్రామాలలో పలు కార్యక్రమాలతోపాటు హెల్మెట్పై అవగాహన సదస్సు, బైక్ర్యాలీ నిర్వహించనున్నామన్నారు. చిత్రలేఖనం, టెన్నీస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్, వాలీబాల్ టోర్నమెంట్ వివిధ గ్రామాలలో నిర్వహించి గెలుపొందిన విజేతలకు 5వ తేదీ సాయంత్ర పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు, పరిపాలనాధికారి దవులూరి సుబ్రమణ్యేస్వరరావు, మున్సిపల్ కమీషనర్ జి. గౌరీ సరోజ చేతులమీదుగా బహుమతులు ప్రధానం చేయనున్నట్లు ఆయన తెలిపారు.

## విశ్రాంత జీవితం ఆరోగ్యంగా, ఆనందంగా గడపాలి

### - అదనపు కమిషనర్ (జనరల్) జివివియస్ మూర్తి



విశాఖపట్నం : జివియంసిలో అనేక సంవత్సరాలు విధులు నిర్వర్తిస్తూ రిటైర్ అవుతున్న వారి విశ్రాంత జీవితం ఆరోగ్యంగా, ఆనందంగా గడవాలని అదనపు కమిషనర్ (జనరల్) జివివియస్ మూర్తి ఆకాంక్షించారు. కాన్ఫరెన్స్ హాలులో రిటైరవుతున్న 6 మందిని శనివారం ఆయన అభినందించి సన్మానించారు. డి రాంబాబు, ప్రాజెక్టు కోఆర్డినేటర్ యుసిడి విభాగం, బి.ఎన్.భాస్కర్ సూపరిండెంట్, పి లక్ష్మి శానిటరీ సూపర్వైజర్, జె. అప్పారావు వర్క్ ఇన్స్పెక్టర్ యుజిడి విభాగం, ఎమ్.నర్సినాయుడు జూనియర్ అసిస్టెంట్, ఎమ్ బాబురావు, శానిటరీ ఇన్స్పెక్టర్ బిడిఆర్ రిటైర్ అయ్యారు. అందరి విశ్రాంత జీవితం ఆరోగ్యంగా ఆనందంగా గడవాలని భగవంతుడు సంపూర్ణ ఆయురారోగ్యాలను ప్రసాదించాలని పేర్కొన్నారు. విధుల్లో చేరిననాడు పదవీవిరమణ తప్పదని తెలిపారు. జివియంసికి చేసిన సేవలు అభినందనీయంగా వెల్లడించారు. రిటైర్ అయిన ఉద్యోగులకు శాలువ, మెమొంటో అందజేశారు. ఈ సందర్భంగా వారికి జరిగిన సన్మానానికి కృతజ్ఞతలు తెలిపారు.

## రోటరీ క్లబ్ వారిచే బేబీ కుర్చీలు పంపిణీ



అన్నవరం: తూ.గో.జిల్లా అన్నవరం గ్రామంలో గల అంగన్వాడి కేంద్రంలో చిన్న పిల్లలు క్రింద కుర్చొని ఉండడంతో స్థానిక రోటరీ క్లబ్ ఆద్వర్యంలో పదిహేను బేబీ కుర్చీలను పిల్లలు కూర్చోవడానికి శనివారము బహుకరించారు.ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ రవి మాస్టర్ (ఎం సూర్యనారాయణ),సెక్రటరీ సరమర్ల.మధుబాబు సభ్యులు గంటసాల.వెంకట్, అంగన్వాడి టీచర్స్ సహాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు .

## రానున్న ఎన్నికలలో కాంగ్రెస్‌దే విజయం

యు కొత్తపల్లి : రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అఖండ విజయం సాధిస్తుందని అఖిల భారత కాంగ్రెస్ పార్టీ సభ్యులు ఓలేటి రాయ భాస్కరరావు జోస్యం చెప్పారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూపీఏ ప్రభుత్వం హయాంలో ఒక యుద్ధ విమానాన్ని కి రూ 500 కోట్ల రూపాయలు తో కొనుగోలు చేయగా బిజెపి ప్రభుత్వం ఒక యుద్ధ విమానానికి సుమారు 16 వందల కోట్లు పెంచి కొనుగోలు చేయడం వింతగా ఉందన్నారు అలాగే నాలుగు సంవత్సరాల బీజేపీ పాలనలో పేద బడుగు రైతులు కూలీలు కార్మికులను అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారని నిరుపేదలను గాలికి వదిలేసి బడా నాయకులకు కొమ్ముకాస్తున్న బిజెపి ప్రభుత్వం కు బుద్ధి చెప్పవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పేర్కొన్నారు పెద్ద నోట్ల రద్దు కారణంగా పరోక్షంగా ప్రత్యక్షంగా లక్షలాదిమంది ఉపాధి కోల్పోయారని మోడీతీసుకుంటున్న ఆర్థిక విధానాలు అన్ని దేశంపై దుష్ప్రభావం చూపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు దేశం లో దళితులపై మతతత్వ వాదులు దాడులు పెరిగిపోయాయని విజయ మాల్యా లాంటి బడా బాబులు బ్యాంకులను మోసం చేసి ఇతర దేశాలకు వెళ్లిపోయిన పట్టించుకునే నాథుడు కరవయ్యారని వాపోయారు మోడీ పాలనలో హిందూ జాగృతి గోసంరక్షణ పేరుతో మైనార్టీల పట్ల దాడులకు తెగ పడ్డారని ఇకనైనా దాడులు ఆపకపోతే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు పెట్రోలు డీజిల్ ధరలు బీజేపీ పాలనలో పెరగటం మొదలయ్యాయని సామాన్యుల నుండి మధ్యతరగతి వరకు ప్రజల్లో అసహనం పెరిగి పోయిందని ఇకనైనా కళ్లు తెరవకపోతే బిజెపి ప్రభుత్వానికి డిపాజిట్లు కూడా దక్కవని హెచ్చరించారు.

## రూ .32 కోట్లతో రైవాడ ఆధునికీకరణ పనులు

దేవరాపల్లి : రైవాడ జలాశయం అధునికీకరణ కు రూ .32 కోట్ల జైకా నిధులు మంజూరైనట్లు ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ పీవీజీ విజయకుమార్ తెలిపారు .జిల్లా ఇరిగేషన్ ఎస్ ఈ పి .శశిభూషణరావు తో కలిసి రైవాడ జలాశయాన్ని సందర్శించారు. ముందుగా రైవాడ కెనాళ్ళు పరిశీలించారు. అనంతరం జలాశయం రెగ్యులేటింగ్ గేట్లు, జలాశయం నుంచి జీవీఎంసీ కి వెళ్లే కాలువను వారు సందర్శించారు .ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రైవాడ జలాశయం ఆధునికీకరణలో భాగంగా కెనాల్స్ లైనింగులు ఏర్పాటు, కాలువ గట్లు పటిష్టత ,జలాశయంపై చుట్టు గోడల నిర్మాణం ఇతర అభివృధి పనులను జైకా మంజూరు చేసిన నిధులతో చెపడతామన్నారు. ఈ మేరకు రైవాడ ఆధునికీకరణకు ప్రభుత్వం నుంచి పరిపాలన అమోదం లభించిందని ,సంకేతిక అనుమతి జారీ కావలసి ఉందన్నారు .రైవాడ జలాశయం నుంచి జీవీఎంసీకి కొలమానం ప్రకారం నీటిని సరఫరా చేసేలా అధునికీకరణలో బాగంగా జైకా నిదులతో కార్యాచరణ చేశామన్నారు. విజయ నగరం జిల్లాలోని ఆంధ్ర ప్రాజెక్టుకు అధునికీకరణకు కూడా జైకా నిధులు రూ .18 .5 కోట్లు మంజూరయ్యాయన్నారు .దీనికి కూడా పరిపాలన అమోదం లభించిందన్నారు .సంకేతిక అనుమతి అనంతరం 45 రోజుల్లో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి నోటిఫికేషన్ జారీ చేసి నవంబర్ నెలాఖరులోగా పనులు ప్రారంభిస్తామన్నారు . అయన వెంట ఈ ఈ మల్లికార్జునరావు ,డి ఈ మాధవి ,జలాశయం చైర్మన్ బి .వెంకటరమణ ,ఏ ఈ ఈ లు సత్యమూర్తి ,కార్తిక్ ,భాగ్య లక్ష్మి తదితరులు ఉన్నారు .

# చిత్రభాను

# ఎన్టీఆర్‌తో...



'ఒక లైలా కోసం' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన కథానాయిక పూజా హెగ్డే 'దువ్వాడ జగన్నాథమ్' సినిమాతో మంచి బ్రేక్ అందుకున్నారు. ఆమె ప్రస్తుతం టాలీవుడ్‌లో బిజీగా గడుపుతున్నారు. 'అరవింద సమేత', 'మహర్షి' సినిమాల్లో నటిస్తున్నారు. ప్రభాస్- రాధాక ృష్ణ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న సినిమాలోనూ ఛాన్స్ దక్కించుకున్నారు. బాలీవుడ్‌లో అక్షయ్ కుమార్ సరసన 'హౌస్‌ఫుల్ 4' సినిమాలోనూ నటిస్తున్నారు. ఇలా వరుస సినిమాలతో పూజా హెగ్డే కాల్‌షీట్ నిండిపోయింది. ఎన్టీఆర్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'అరవింద సమేత'. హరిక ృష్ణ హఠాన్మరణంతో కొన్ని రోజులు ఈ చిత్రం షూటింగ్ వాయిదా పడింది. దీంతో అప్పుడు తీయాల్సిన సన్నివేశాల్ని ఇప్పుడు తీస్తున్నారు. హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతోంది. ప్రస్తుతం పూజా హెగ్డే ఈ షెడ్యూల్‌లో పాల్గొంటున్నారు. షూట్ వాయిదా పడటంతో ఆమె తన డేట్స్‌ను కష్టపడి మార్చుకున్నట్లు తెలుస్తోంది. ఓ పక్క ఇక్కడ షూట్‌లో పాల్గొంటూనే.. రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో జరుగుతోన్న 'హౌస్‌ఫుల్ 4' చిత్రీకరణకు కూడా హాజరౌతున్నారట. దీని కోసం ఆమె ప్రైవేట్ జెట్‌లో ప్రయాణిస్తున్నట్లు సమాచారం. హైదరాబాద్ నుంచి జైసల్మేర్‌కు కేవలం ఒక్క విమానం మాత్రమే ఉందని, అందులో వెళ్లాలంటే చాలా సమయం పడుతుందని ప్రైవేట్ జెట్‌లో వెళ్తున్నట్లు చెబుతున్నారు. రాజస్థాన్ మిలిటరీ ఏరియా కావడంతో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6 గంటల మధ్యలో ఎటువంటి ప్రైవేట్ జెట్‌ను అనుమతించరు. కానీ పూజా హెగ్డే మేనేజర్, నిర్మాతలు అనుమతి తీసుకున్నట్లు సమాచారం. ప్రైవేట్ జెట్‌లో ప్రయాణించేందుకు లక్షల్లో ఖర్చు అవుతుంది, కానీ డబ్బు కన్నా సమయానికి సెట్‌కు చేరుకోవడానికే పూజా హెగ్డే ప్రాధాన్యత ఇస్తున్నారట.

# రజనీకాంత్ మాస్ లుక్..తో

అగ్ర కథానాయకుడు రజనీకాంత్ 165 సినిమా టైటిల్ ప్రకటించేశారు. ఈ చిత్రానికి కార్తిక్ సుబ్బరాజు దర్శకత్వం వహిస్తున్నారు. త్రిష కథానాయిక. విజయ్ సేతుపతి, సిమ్రన్, నవాజుద్దీన్ సిద్ధిఖీ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. సన్ పిక్చర్స్ సంస్థ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈ చిత్రం తమిళ టైటిల్‌ను శుక్రవారం సాయంత్రం విడుదల చేశారు. 'పెట్టా' అనే పేరును ఖరారు చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన మోషన్ పోస్టర్‌లో తలైవా చాలా స్టైలిష్, మాస్‌గా కనిపించారు. ఆయన లుక్ అభిమానుల్ని ఆకట్టుకుంది. దీంతో ఫ్యాన్స్ ట్విటర్‌లో తెగ లైక్‌లు, షేర్లు, కామెంట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన హ్యాష్‌ట్యాగ్‌లు ట్విటర్ ట్రెండింగ్‌లో ఉన్నాయి. 'పెట్టా' రెండో స్థానంలో, 'తలైవా165' నాలుగో స్థానంలో, 'సూపర్‌స్టార్ విత్ సన్‌పిక్చర్స్' ఐదో స్థానంలో, 'రజనీకాంత్' ఆరో స్థానంలో ఉన్నాయి. రజనీ సినిమా కోసం అభిమానులు ఎంతగా ఎదురుచూస్తున్నారో దీని ద్వారా తెలిసిపోతోంది. మరోపక్క తలైవా నటించిన '2.ఓ' సినిమా టీజర్‌ను సెప్టెంబరు 13న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. శంకర్ దీనికి దర్శకత్వం వహిస్తున్నారు. అమీ జాక్సన్, అక్షయ్ కుమార్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. నవంబరు 29న ఈ సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.







## మానసిక వైద్యుని కలం నుంచి మహత్తర అక్షర సత్యాలు

### సంకలనాలు పూర్వీకులకు అంకితం చేసిన డాక్టర్ విజయ గోపాల్




విశాఖపట్నం : మానవ సమాజం లోని మానసిక రుగ్మతలు, కీలక సమస్యలకు పరిష్కారాలను కేవలం వైద్యం ద్వారానే కాకుండా, రచనల ద్వారా కూడా సూచించవచ్చు అని ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ మోపిదేవి విజయ గోపాల్ చేసిన రచనా ప్రయోగం మంచి ఫలితాలను ఇచ్చింది అని, ఉత్తరాంధ్ర జిల్లాల ఎమ్మెల్సీ పివిఎన్ మాధవ్ అన్నారు. విశాఖనగరం లోని పౌర గ్రంధాలయం లో అఖిల భారతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యవం లో శనివారం జరిగిన కవితా సంకలనాల ఆవిష్కార సభకు ముఖ్య అతిధిగా హాజరైన వారు మాట్లాడుతూ . . . అఖిల భారతీయ సాహితీ పరిషత్ ఆధ్వర్యవం లో సాహితీ సభలను నిర్వహించి, విభిన్న వృత్తుల్లో ఉంటూ, తమకు నిత్యం ఎదురయ్యే ప్రతీ ఘటనను రచనాంశం గా స్వీకరించడం విజయ్ గోపాల్ గొప్పతనమన్నారు.

సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ సాహితీ వేత్త డివి సూర్యారావు మాట్లాడుతూ వైద్య వృత్తి లో ఉంటూ ప్రజా సేవ చేస్తూ, మరో ప్రక్క సాహితీ సేవ అందిస్తున్న విజయ్ గోపాల్ అభినందనీయులన్నారు. రెండు విభిన్న దృక్పధాలలో సంచారం చేస్తూ అందరి మన్ననలూ అందుకుంటున్నారన్నారు.

**వంశ పూర్వీకులకు అంకితం :**

నాకో జీవితం ఇవ్వండి సంకలనం విజయ్ గోపాల్ తన తల్లిదండ్రులు మోపిదేవి రామ్మూర్తి, జానకి లకు అంకితం చేయగా, నాల్గవ సంకలనం నాదీ మట్టి పోరాటమే ను తన ముత్తాత గురజాడ అప్పారావు కు అంకితం చేసినట్టు వివరించారు.

**నాదీ మట్టి పోరాటమే :**

ఈ సంకలనాన్ని నవయుగ భారతి (హైదరాబాద్), సంపాదకులు డాక్టర్ వడ్డి విజయ సారధి ఆవిష్కరించగా, విశ్రాంత అధ్యాపకులు డాక్టర్ మారడాన సుబ్బారావు సమీక్ష జరిపారు. అత్యంత అద్భుతంగా సాగే ఈ రచనా శైలి లో ఎన్నో ఎన్నెన్నో ప్రజా సమస్యలకు అక్షర రూపం కల్పించారన్నారు. వాటిలో ప్రధానాంశాలు :

గురజాడ ఏదీ నీ అడుగుజాడ ? - ఈ అన్న దేశ వెన్నుకొక విరుస్తున్నారు. దేశం గురించి రచన లో భాగంగా . . . కలలో భారతం. . . .: బాధలు లేవు, లంచాలు లేవు, అడ్డు గోడలు లేవు అనే రచన, .. బ్రిటిష్ ను తరిమినా తీవ్రవాదం తరలలేదు., రాజకీయ స్వాతంత్రం వచ్చింది కానీ స్వేచ్ఛ స్వాతంత్రం కాదు, మహాకవీ మామ్మవహించవయ్యా, తీవ్రవాద ఉద్యమ వ్యతిరేకంగా చేసిన రచన అందరినీ ఆకట్టుకుంది.

## అవి ఉత్తమ క్షణాలు : శిఖర్ ధావన్



న్యూఢిల్లీ : ఆసియా ఛాంపియన్‌గా భారత్ మరోసారి నిలిచింది. చివరి బంతి వరకు ఉత్కంఠగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌పై మూడు వికెట్ల తేడాతో టీమిండియా విజయం సాధించింది. ఆసియా కప్ టోర్నీలో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన భారత ఓపెనర్ శిఖర్ ధావన్ మ్యాన్ ఆఫ్ ది టోర్నీగా ఎంపికయ్యాడు. ఈ ఆనందాన్ని తన కుమారుడు జొరావర్‌తో కలిసి ధావన్ సోషల్‌మీడియా వేదికగా పంచుకున్నాడు. ఇవి ఉత్తమ క్షణాలు అంటూ పేర్కొన్నాడు. కొడుకుతో కలిసి ఆసియా కప్ ట్రోఫీని పట్టుకున్న ఫొటోను ధావన్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశాడు. నా కుమారుడు జొరావర్‌ను ఎత్తుకుని ట్రోఫీని పట్టుకోవడం అనేది ఉత్తమమైన క్షణం. ఓ గొప్ప సిరీస్. అద్భుతమైన ఫైనల్స్. ఆసియాకప్ మాతోనే ఉంది అని ధావన్ రాసుకొచ్చాడు. ఆసియాకప్ టోర్నీలోని మొత్తం ఐదు మ్యాచ్‌లలో ధావన్ 342 పరుగులు చేశాడు. అయితే జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మాత్రం ధావన్ 15 పరుగులకే ఔటయ్యాడు. మ్యాచ్ అనంతరం ధావన్ మాట్లాడుతూ.. ఈ టోర్నీని నేను ఎంతో ఆనందించాను. ఫైనల్ మ్యాచ్ అద్భుతంగా సాగింది. నా బ్యాటింగ్‌ను కూడా ఎంజాయ్ చేశాను అని అన్నాడు.




## మరో హీరోతో కీర్తి సురేష్ రొమాన్స్

మహానటి ఘన విజయం అందాల తార కీర్తి సురేష్‌ను మరోస్థాయికి తీసుకెళ్లింది. ఆ చిత్రం తర్వాత కీర్తి సురేష్ కోసం దక్షిణాది నిర్మాతలు క్యూ కడుతున్నారట. ప్రస్తుతం విక్రమ్ జతకట్టి కీర్తి సురేష్ నటించిన సామి స్క్వేర్ చిత్రం త్వరలో విడుదల కానున్నది. ఈ క్రమంలో శింబుతో మానాడు చిత్రంలో, శశికుమార్‌తో కొంబు వేచా సింగం అనే చిత్రంలో నటించమని ఆఫర్లు వచ్చాయి. అయితే దర్శకుడు వెంకట్ ప్రభు రూపొందిస్తున్న పొలిటికల్ సెటైర్ చిత్రంలో నటించమని కీర్తి సురేష్‌ను సంప్రదించారట. అందుకు ఆమె సానుకూలంగా స్పందించి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారట. అధికారికంగా కొన్ని వ్యవహారాలు పూర్తి కావాల్సి ఉండటంతో బయటకు వెల్లడించడం లేదట. ఇక శశికుమార్‌తో ఎస్ఆర్ ప్రభాకరన్ రూపొందించే సినిమాపై కీర్తి సురేష్ పెద్దగా స్పందించడం లేదట.

మంచి ప్రాజెక్టుల కోసం ఎదురుచూడటమే ప్రధాన కారణమని చెప్పుకొంటున్నారు.

# పవన్ కళ్యాణ్ ప్రజల కోసమే రోడ్డుమీదకొచ్చారు

## ...డాక్టర్ బొడ్డేపల్లి రఘు

విశాఖపట్నం : స్వాంతంత్ర్య సమరంలో నాడు ప్రజల కోసం భగత్ సింగ్ పోరాటం చేసి చిన్న వయస్సులో ప్రాణాలు అర్పిస్తే..నేడు కోట్ల రూపాయల ఆదాయం వదులుకొని ప్రజలు దగా పడకూడదనే లక్ష్యంతో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జనజీవంలోకి వచ్చారని సురక్షా సంస్థల అధినేత, విశాఖ ఉత్తర నియోజకవర్గ నాయకులు డాక్టర్ రఘు కొనియాడారు. భగత్ సింగ్ స్పూర్తితో పనిచేసే జనసైనికులంతా ఆయనలా ప్రాణాలు త్యధించాల్సిన పనిలేదని, ప్రజల కోసం పనిచేసే మంచి వ్యక్తులను చట్టసభలకు పంపేందుకు తనవంతు క్రుషి చేయాలన్నారు. దాని కోసం 18ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటుహక్కు నమోదు చేయించుకొని ఆ ఓటు ద్వారానే ఏపీలో పవన్ కళ్యాణ్ ని ముఖ్యమంత్రిని చేయాలన్నారు. జనసేన సోషల్ జస్టిస్ పి.శివశంకర్ మాట్లాడుతూ..ప్రజల కోసం అలుపెరగకుండా అన్ని ప్రాంతాలు తిరిగి ప్రజా సమస్యలు తెలుసుకోవాలని ప్రయత్నం చేస్తున్న పవన్ కళ్యాణ్ గారిని చంపాలని చూస్తున్న పాలకవర్గాన్ని జనసైనికులు వదిలి పెట్టరన్నారు. నాటి తెల్లవాడి మహా సంగ్రామంలో వీరుడిలా పోరాడి భారతదేశ ప్రజలను కాపాడిన భగత్ సింగ్ ను ఆదర్శంగా తీసుకొని నేడు మనల్ని దగా చేసే ప్రభుత్వాల నుంచి కాపాడటంలో పవన్ కళ్యాణ్ కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. జిల్లా కోఆర్డినేటర్ అశోక్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ, ప్రజల కోసం పనిచేసే జనసేన పార్టీని అధికారంలోకి తీసుకురావాలంటే యువత ప్రధాన భూమిక పోషించాలన్నారు. అలాంటి యువత నేడు జనసేన పార్టీలో సైన్యంలా పనిచేస్తున్నారని అన్నారు. అయితే ప్రభుత్వం దానిని చూసి ఓర్వలేక ఓట్లను రద్దుచేసి నీచ రాజకీయాలు చేస్తుందని విమర్శించారు. బొగ్గశ్రీను మాట్లాడుతూ, నేడు ప్రభుత్వాలను నిలబెట్టాలన్నా, పడగొట్టాలన్నా యువతే ముఖ్య కారణమని, అలాంటి మంచి యువత విశాఖలో డాక్టర్ రఘు వెనుక ఉన్న విషయం ర్యాలీ ఫర్ యూనిటీ అనే కార్యక్రమం చూసిన వారికి అర్ధమవుతుందన్నారు. మాటలతో మాయచేసే ప్రభుత్వాల కంటే ప్రజా క్షేత్రంలో ఉండి సహాయం చేసే పవన్ కళ్యాణ్ లాంటి వారు ముఖ్యమన్నారు. భగత్ సింగ్ జయంతి సందర్భంగా ఆయన ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తున్న పవన్ కళ్యాణ్ కూడా జన సైనికులకు ఆదర్శంగా ఉన్నారని అందుకే నేడు పార్టీలోకి అనేకవేల మంది చేరికలు జరుగుతున్నాయని గుంటూరు నర్శింహ మూర్తి అన్నారు. అంతే కాకుండా ఈ భారీ బహిరంగ సభకు కూడా జనం స్వచ్ఛందంగా తరలిరావడం కూడా పవన్ కళ్యాణ్ పై ఉన్న గౌరమేనన్నారు. ఈ సందర్భంగా ముస్లింగ్ వింగ్ ఆధ్వర్యంలో యువకులు మక్కా మసీదు నుంచి తీసుకు వచ్చిన పవిత్ర జలాన్ని డాక్టర్ రఘుకి అందజేసి, కండువా కప్పి ఘనంగా సత్కరించారు. అంతకు ముందు భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా అంజలి ఘటించారు. ఈ సందర్భంగా సుమారు 200 మంది యువకులు జనసేన పార్టీలోకి చేరారు. వారిని పార్టీ కండువా కప్పి సోషల్ జస్టిస్ పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మహిళా విభాగం నాయకులు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.



### వరల్డ్ హార్ట్ డే సందర్భంగా

# ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రక్షణదళం సైకిల్ ర్యాలీ



విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రక్షణదళం వరల్డ్ హార్ట్ డే సందర్భంగా గుండెపై శ్రద్ధ మరియు శారీరక దృఢత్వంపై ప్రజలలో చైతన్యం తీసుకొనుటకు విశాఖపట్నం ఆర్కే బీచ్ యందు ర్యాలీ నిర్వహించారు. ఈ సైకిల్ ర్యాలీ ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు, ఎస్‌పిఎఫ్ కమాండెంట్ డిఎన్ఏ భాషా జెండా ఊపి ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రక్షణ దళం డైరెక్ట్ జనరల్ మాదిరెడ్డి ప్రతాప్ ఐపిఎస్ పిలుపు మేరకు ప్రజలలో ఆరోగ్యం నందు శ్రద్ధ, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించుటకు ఈ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కమాండెంట్ డిఎన్ఏ భాషా మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం నడక, వ్యాయామం, సైక్లింగ్ చేయడం వలన బీపీ, సుగర్ రాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని మరియు గుండె జబ్బుల నుండి దూరం కావచ్చని పేర్కొన్నారు. ఈ ర్యాలీ ఆర్కేబీచ్ నుంచి సాగర్‌నగర్, సాగర్‌నగర్ నుంచి ఆర్‌కె బీచ్ వరకు నినాదాలు చేస్తూ సాగింది. ఈ సైకిల్ ర్యాలీ నందు విద్యాశాఖమంత్రి గంటా శ్రీనివాసరావు, కమాండెంట్ డిఎన్ఏ భాసా, సుధాకర్, కెజిహెచ్ ఆర్ఎంఓ కెఎస్ఎల్‌జి.శాస్త్రి, హేమకుమార్, సుమారు 100మంది ఏపి ఎస్‌పిఎఫ్ సిబ్బంది ప్రసో అడ్వర్టైజింగ్ పాల్గొన్నారు.

# పుతిన్‌కు మిగ్‌లను గిఫ్ట్ ఇవ్వనున్న భారత్ !



న్యూఢిల్లీ: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్.. అక్టోబర్‌లో భారత్ రానున్నారు. ఈ నేపథ్యంలో ఆ దేశానికి.. మిగ్-21 యుద్ధ విమానాలను భారత్ బహూకరించనున్నది. మొత్తం మూడు మిగ్-21 విమానాలను గిఫ్ట్‌గా ఇచ్చేందుకు భారత్ ఏర్పాట్లు చేస్తుంది. మూడు మిగ్‌లు ఇవ్వాలంటూ రష్యా రక్షణ మంత్రి చేసిన అభ్యర్థన మేరకు భారత్ ఈ నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. రెండు దేశాల మధ్య వ్యూహాత్మక, రక్షణ ఒప్పందం బలంగా ఉందన్న సంకేతాన్ని ఇచ్చేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. వాస్తవానికి మిగ్ యుద్ధ విమానాలను సోవియెట్ రష్యానే తయారు చేసింది. రష్యన్ టెక్నాలజీ తయారైన మిగ్ విమానాలే భారత వైమానిక దళంలో ఉన్నాయి. భారత ఎయిర్‌ఫోర్స్ వద్ద ఇంకా 121 మిగ్ విమానాలు ఉన్నాయి. అయితే అందులోని టైప్ 75, టైప్ 77 విమానాలను రష్యాకు గిఫ్ట్‌గా ఇవ్వనున్నట్లు తెలిసింది. ధ్వని వేగం కన్నా రెట్టింపు వేగంతో ప్రయాణించే మిగ్-21కు రష్యాతో ప్రత్యేక అనుబంధం ఉంది. మిగ్ ఉత్పత్తిని రష్యా 1985లోనే నిలిపేసినా.. భారత్ మాత్రం ఆ యుద్ధ విమానాలనే ఇంకా వాడుతున్నది. 1963లో మిగ్ తయారీల కోసం లైసెన్సు తెచ్చుకున్న భారత్.. ఆ విమానాలనే నిర్మిస్తూ వైమానిక దళాన్ని బలోపేతం చేస్తోంది. కానీ 2022లోపు దశల వారీగా మిగ్‌లను తగ్గించాలని భారత్ నిర్ణయించింది.



*భారత్ సంచార్ నిగామ్ లిమిటెడ్ కేంద్ర ప్రభుత్వ సంస్థ లో సుదీర్ఘకాలంపాటు సేవలు అందించి శనివారం పదవీ విరమణ చేసిన చొక్కాకుల అప్పారావు దంపతులకు ఘనంగా సన్మానిస్తున్న కుటుంబ సభ్యులు, బీ ఎస్ ఎన్ ల్ సిబ్బంది , ప్రముఖ వ్యాపారవేత్త, వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చొక్కాకుల వెంకటరావు,లక్ష్మీ దంపతులు, విశాఖ దక్షిణ నియోజకవర్గ వై.ఎస్.ఆర్.సి.పి సమన్వయకర్త డాక్టర్ పైడి వెంకటరమణ మూర్తి ,తదితరులు*

# సామాజిక దృక్పథంతోనే ఎన్టీఆర్ సినిమాల్లోకి వచ్చారు

## ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ



అనంతపురం: సామాజిక దృక్పథంతోనే విశ్వవిఖ్యాత నట సార్వభౌమ నందమూరి తారకరామారావు సినిమాల్లోకి వచ్చారని ఆయన కుమారుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. శుక్రవారం అనంతపురం జిల్లా పరిషత్ ఆవరణలో ఎన్టీ రామారావు విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. సినీరంగంలో ఎదురులేని నటుడిగా ఆదరణ సంపాదించుకున్న ఆయన పేద, బలహీన వర్గాల కోసం రాజకీయాల్లోకి వచ్చారన్నారు. పేద ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. బలహీనవర్గాల్లో ఆర్థిక, సామాజిక, రాజకీయ చైతన్యం తీసుకురావడానికి విశేష కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కాల్వ శ్రీనివాసులు, ప్రభుత్వ చీఫ్ విప్ పల్లె రఘునాథ రెడ్డి, ప్రభుత్వ విప్ యామినీ బాల, ఎమ్మెల్యేలు, రాజకీయ ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

## మావోయిస్టులకు సత్తా చూపిస్తాం : డీజీపీ

అమరావతి: అరకు ఎమ్మెల్యే సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సోమ హత్య కేసులో పోలీసులు పురోగతి సాధించారు. లివిటిపుట్టు దాడిలో ఎవరెవరు పాల్గొన్నారో గుర్తించామని ఏపీ డీజీపీ ఆర్పీ ఠాకూర్ తెలిపారు. మావోయిస్టులు ఏ మార్గాల్లో వచ్చారో కూడా గుర్తించినట్టు వెల్లడించారు. దాడిలో ఎక్కువగా ఛత్తీస్‌గఢ్, ఒడిశా నుంచి పాల్గొన్నారని, అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు ముమ్మరం చేశామని తెలిపారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

మావోయిస్టులకు పోలీసుల సత్తా ఏమిటో చూపిస్తామని స్పష్టం చేశారు. మావో ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న నేతలకు భద్రత పెంచినట్టు డీజీపీ తెలిపారు.

# ఆసుపత్రి నుంచే పారికర్ విధుల నిర్వహణ

## గోవా పీడబ్ల్యూడీ మంత్రి వెల్లడి



పనాజీ: గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ ఆసుపత్రిలో ఉండటం వల్ల పాలనా వ్యవహారాలు ఆగిపోవట్లేదని రాష్ట్ర పీడబ్ల్యూడీ శాఖ మంత్రి సుదిన్ ధవలైకర్ అన్నారు. పారికర్ ఆసుపత్రి నుంచే విధులు నిర్వహిస్తున్నారని, ఫైళ్లపై సంతకాలు పెడుతున్నారని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి పారికర్ ఆసుపత్రి నుంచే విధులు నిర్వహిస్తున్నారు. మేం పంపించిన ఫైళ్లను రెండు మూడు రోజుల్లోనే పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం ఏ ఫైల్ కూడా పెండింగ్‌లో లేదు అని సుదిన్ ఓ కార్యక్రమంలో తెలిపారు. పారికర్ ఆదేశాల మేరకు ప్రతి బుధవారం రాష్ట్ర కేబినెట్ సమీక్ష నిర్వహిస్తోందని, పాలనా వ్యవహారాలపై చర్చిస్తోందని తెలిపారు. సమీక్షకు సంబంధించిన నివేదికను ముఖ్యమంత్రికి పంపిస్తున్నామన్నారు. ఇటీవల గోవాలో రాజకీయ అస్థిరత నెలకొన్న విషయం తెలిసిందే. గత కొంతకాలంగా పాంక్రియాటిక్ సమస్యతో బాధపడుతున్న పారికర్ తరచూ విధులకు దూరమవుతున్నారు. ఆ మధ్య ముంబయి, అమెరికా ఆసుపత్రుల్లో చికిత్స తీసుకున్న గోవా సీఎం ప్రస్తుతం దిల్లీలోని ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. అయితే పారికర్ ఆసుపత్రిలో ఉన్న సమయంలో రాష్ట్ర బాధ్యతలు ఎవరికీ అప్పగించకపోవడంపై ప్రతిపక్ష కాంగ్రెస్ విమర్శలు చేసింది. రాష్ట్రంలో పాలనా వ్యవస్థ దెబ్బతింటోందని ఆరోపించింది. మరోవైపు భాజపా, కూటమి పార్టీల మధ్య విభేదాలు నెలకొన్నట్లు కూడా వార్తలు రావడంతో వాటిని అనుకూలంగా మార్చుకుని అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ ప్రయత్నించింది. సంఖ్యాపరంగా అసెంబ్లీలో తమకు బలం ఎక్కువగా ఉందని, ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసేందుకు అవకాశం ఇవ్వాలని గవర్నర్‌ను కోరింది. అయితే ఆ తర్వాత భాజపా జాతీయాధ్యక్షుడు అమిత్‌షా రంగంలోకి దిగడంతో గోవా రాజకీయ పరిస్థితులు చక్కబడ్డాయి.

# దేశాన్ని సమర్ధంగా నడపగల సత్తా యువతరానిదే

## జియస్ఐబి పట్టభద్రుల దినోత్సవంలో మాజీ డిజిపి



సాగర్‌నగర్ : ప్రపంచంలోని ఏ రంగానికి అయినా అవసరం అయిన ప్రతిభాపాటవాలు భారతదేశ యువతలో ఉన్నాయని అవి దేశాన్ని సమర్ధంగా నడపడానికి సహితం ఉపయోగపడగలవని ఆంధ్రప్రదేశ్ విశ్రాంత ఐపిఎస్ అధికారి, డైరక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, గంగవరం పోర్టు సిఇఓ ఎన్.సాంబశివరావు పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని గీతం స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ పట్టభద్రుల దినోత్సవానికి ఆయన శనివారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రస్తుతం తరం యువత ప్రతిభకు తోడుగా వ్యూహాత్మక వైఖరి, భవిష్య లక్ష్యాలు, ఆశావహ దృక్పథంతో ముందుకు సాగాలన్నారు. ఆర్థికంగా పురోగమిస్తున్న ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలకు యువతరంతోనే ముడిపడిన ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఉందని ప్రశంసించారు. జిఎస్ఐబి ఇన్‌ఛార్జి డైరక్టర్ ప్రొఫెసర్ కె.కె.నారాయణన్ అధ్యక్షతన జరిగిన ఈ పట్టభద్రల దినోత్సవంలో దేవీ సీఫుడ్స్ మేనేజింగ్ డైరక్టర్ పి.బ్రహ్మానందంకు ఫెలోషిప్‌ను అందించారు.



**విద్యార్థులకు బంగారు పతకాలు :** అంతర్జాతీయ వాణిజ్య విద్యాకోర్సులలో ప్రతిభ కనబరిచిన కొనిశెట్టి శేషుకు గీతం అధ్యక్షుని పేరిట బంగారు పతకాన్ని, వి.చిట్టి సంధ్యారాణికి మహిళా విభాగంలో బంగారు పతకాన్ని అందజేశారు. పి.వినీషకు రజత పతకం, ఎం.దీపికకు కాంస్య పతకం అందజేశారు.

రెండేళ్ళ వాణిజ్య విద్యలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అందించే డా.కె.రోశయ్య ప్రతిభా పారితోషకాన్ని ఈ ఏడాది లోకేష్‌టంకాలా (లక్షరూపాయలు) అందుకోగా, మహ్మద్‌నూర్ ఆలమ్ ఫీజు మినహాయింపు అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో ప్రొ.వెంకటేశ్వర్లు, ప్రొ.డి.రవినాథ్, ప్రొ.రాజా, ఆర్.పప్పు తదితరులు పాల్గొన్నారు. పట్టభద్రుల దినోత్సవంలో భాగంగా కోర్సు పూర్తి చేసిన వారికి డిగ్రీలను అందజేశారు.

### గీతంలో నిర్వాణ సాంకేతిక ఉత్సవం ముగింపు

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఐఇఇఇ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో రెండురోజులుగా జరుగుతున్న సాంకేతిక యువజనోత్సవం నిర్వాణ సాంకేతిక ఉత్సవం శనివారం ముగిసింది. కాస్మోజెన్ అంతరిక్ష పరిశోధనా సంస్థ వ్యవస్థాపకుడు రజత్‌కుమార్ దని ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ప్రపంచంలోని ప్రస్తుత అంతరిక్ష పరిశోధనలు, ప్రయోగాలను ఆయన వివరిస్తూ 24 గ్రాముల బరువు ఉండే 3.3 సెంటీమీటర్ల పరిమాణంలోని ఉపగ్రహన్ని అంతరిక్షంలోని పంపడం తమ లక్ష్యమని తెలిపారు. ఇంజనీరింగ్‌లో ప్రతి విభాగం మరో విభాగంలో అనుసంధానం అవ్వాలని ముఖ్యంగా ఇంజనీరింగ్ నిపుణులు విధించుకోరాదన్నారు.

గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ప్రొ.కె.లక్ష్మిప్రసాద్ సాంకేతిక పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఇఇఇ విభాగం కోఆర్డినేటర్ మహ్మద్ కె.ఎమ్.చిస్టి, విద్యార్థి విభాగం కార్యదర్శి ఎమ్.చేతన్, ఫ్యాకల్టీ సలహాదారు డి.సందీప్ పాల్గొన్నారు.

## కొత్తకూటమికి తెరలేపిన అమెరికా

న్యూయార్క్: ఇరాన్‌కు వ్యతిరేకంగా అరబ్ దేశాలను ఏకం చేసేందుకు అమెరికా కసరత్తులు మొదలు పెట్టింది. ఈమేరకు ఐక్యరాజ్య సమితి సాధారణ సమావేశం కోసం న్యూయార్కు వచ్చిన అరబ్ దేశాల ప్రతినిధుల ఎదుట అమెరికా మిత్రులను ఏకం చేసేలా అరబ్ నాటో పేరిట కొత్త కూటమిని ప్రతిపాదించింది. ఈ సమావేశంలో బహ్రెయిన్, ఈజిప్టు, జోర్డాన్, కువైట్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ దేశాల విదేశీ వ్యవహారాల మంత్రులు పాల్గొన్నారు. అమెరికా ప్రతిపాదనకు మద్దతు తెలుపుతూనే ముందు ..మధ్య ప్రాచ్యంలో నెలకొన్న అనిశ్చితిని తొలగించాలని ఖతార్ సూచించింది. ఈమేరకు ఖతార్ మంత్రి షేక్ మొహదూన్ బిన్ అబ్దుల్ ర్హామ్‌న్ సమావేశం అనంతరం తెలిపారు. సిరియా, యెమెన్‌లో శాంతిస్థాపనకు అమెరికా కృషి చేయాలని, ఇరాక్‌ను భద్రంగా మార్చేం దుకు ఆ ప్రాంతంలో ఉగ్ర చర్యలకు పాల్పడుతున్న ఇరాన్‌ను కట్టడి చేసేందుకు కలిసి రావాలని అమెరికా కార్యదర్శి పాంపియో కోరగా.. ఖతార్ ఈమేరకు స్పందించింది. 2017 జూన్ నుంచి సౌదీ, ఎమిరేట్స్, బహ్రెయిన్, ఈజిప్టు దేశాలు ఖతార్‌పై నిషేదం విధించాయి. ఇరాన్‌తో దౌత్య సంబంధాలు నెరపవద్దని, అల్‌జజీరా ఛానల్‌ను మూసివేయాలని డిమాండ్లు విధించడం సహా లెబనాలోని ఉగ్రసంస్థలైన హిజ్బుల్లా, ముస్లిం బ్రదర్‌హుడ్‌పార్టీతో ఖతార్‌కు సంబంధాలు ఉన్నాయని ఆరోపిస్తున్నాయి.

LOANS / లోన్స్
HAPPY HOMES
We arrange Business Loans
Mortgage Loans
Home Loans Personal Loans
and Pvt. Loans... Etc.,
94902 33750




VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com